# విద్యార్థి వెలుగు

Volume VIII - Issue VIII - Aug 2025



వెలుగుగా
జీవించు

# వెలుగుగా జీవించాలి

రాత్రి పూట నావికులు దారి తప్పి అపాయంలో ఉన్నప్పుడు, దూరంగా కనిపించే ఒక చిన్న దీపపు కాంతి వారికి ఆశను, మార్గాన్ని చూపినట్లుగా, మన జీవితాలు కూడా ఇతరులకు ఆ విధంగానే ఉండాలి. బైబిల్‌లో యేసుక్రీస్తు "మీరు లోకానికి వెలుగు" అని చెప్పాడు. ఈ మాటలు కేవలం ఒక ఉపదేశం కాదు, ఇది మనందరికీ దేవుడు ఇచ్చిన ఒక సవాలు, ఒక గొప్ప పిలుపు!

చరిత్రలో అనేకమంది వ్యక్తులు తమ జీవితాల ద్వారా లోకానికి వెలుగుగా నిలిచారు. ఉదాహరణకు, మదర్ థెరిస్సా గురించి మనం తరచుగా వింటూ ఉంటాం. ఆమె కోల్‌కతా వీధుల్లో నిరాదరణకు గురైన వారికి సేవ చేస్తూ, వారి జీవితాల్లో ఒక చిన్న వెలుగును వెలిగించింది. ఆమె గొప్ప ఉపన్యాసాలు ఇవ్వకపోయినా, ఆమె పనులే లోకానికి ఆమె గొప్పతనాన్ని చాటి చెప్పాయి. ఆమె పేదవారికి నిస్వార్థ సేవ చేయడం ద్వారా క్రీస్తు ప్రేమను ప్రతిబింబించింది. ఆమె జీవితం, "వెలుగుగా జీవించడం" అంటే ఏమిటో కళ్ళకు కట్టినట్లు చూపింది.

మనం వెలుగుగా ఎలా జీవించగలం? ఇది కేవలం గొప్ప కార్యాలు చేయడం ద్వారా మాత్రమే కాదు, మన దైనందిన జీవితంలో మనం తీసుకునే చిన్న చిన్న నిర్ణయాల ద్వారా కూడా సాధ్యమే. మన మాటలు, మన పనులు, మన వైఖరి – ఇవన్నీ మనలో ఉన్న క్రీస్తు స్వభావాన్ని ప్రతిబింబించాలి. బైబిలు కూడా ఇదే చెబుతోంది, "మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారియెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి" (మత్తయి 5:16).

ఉదాహరణకు, మన క్యాంపస్‌లో, పని చేసే చోట నిజాయితీగా ఉండటం, కుటుంబంలో ప్రేమను చూపడం, స్నేహితులకు కష్టంలో తోడుగా నిలబడటం, సమాజంలో అన్యాయాన్ని వ్యతిరేకించడం – ఇవన్నీ మనం వెలుగుగా జీవించడానికి మార్గాలు. మనం చీకటిని దూరం చేయాలంటే, మనం వెలుగును ప్రసరింపజేయాలి.

నిజమైన వెలుగు కేవలం పైపై మెరుపు కాదు, అది హృదయం నుండి వచ్చేది. ఇది దేవుని ప్రేమతో నిండిన హృదయం నుండి ప్రవహించేది. మనం క్రీస్తులో ఎలా ఉన్నామో తెలుసుకున్నప్పుడు, మనం ఆ వెలుగును ఇతరులకు పంచగలం. మనలోని చీకటిని తొలగించుకొని, దేవుని వాక్యాన్ని మన జీవితాలకు దీపంగా ఉండనిద్దాం.

"నేను లోకమునకు వెలుగును, నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగుగలిగి యుండును" అని యేసుక్రీస్తు అన్నాడు (యోహాను 8:12). మనం ఆయనను వెంబడించడం ద్వారానే మనం వెలుగుగా జీవించగలం. మన జీవితాలు ఇతరులకు మార్గదర్శకంగా, క్రీస్తు ప్రేమకు సాక్ష్యంగా నిలవాలి. మనం ప్రతిరోజూ మన జీవితంలో ఈ గొప్ప పిలుపును గుర్తుంచుకుంటూ, "వెలుగు వలె జీవించడానికి" ప్రయత్నిద్దాం. అప్పుడే మన జీవితాలు కేవలం మనకే కాకుండా, లోకానికి కూడా ఆశీర్వాదంగా మారతాయి.

– కె. జాన్ భూషణం

# విద్యార్థి వెలుగు

Vol. VIII - Issue VIII - Aug 2025

UESI PUBLICATION TRUST - TELANGANA BRANCH



**EDITORIAL BOARD**

Editor and Publisher:
Mr. Dasari Rajesh, Hyderabad

Managing Editor:
Mr. K. John Bhushanam, Cyberabad

UESI PT TG Branch Sec.:
Mr.V Rajendra Prasad, Hyderabad

**Members:**
Mr. S. Jayaraju, Hyderabad
Mr. Raja Sekhar Addanki, Cyberabad
Mrs. V. Lilly Thedora, Hyderabad
Dr. Yerranna Boggula, Medchal Malkajgiri
Mrs. B.Lily Agnes, Mancherial
Dr. S. John Sukumar, Nizamabad
Ms. U. Catherine Chelsea, Hyderabad



**CONTACT DETAILS**

The Editor, Vidyarthi Velugu
UESI Publication Trust - Telangana Branch
H. No: 6 - 68/36, Jangampet Village,
Jinnaram Mandal, Sangareddy District, Pin-502319
Ph: 9491595765
Email: editorvv2018@gmail.com

**SCAN THE QR CODE TO SUBSCRIBE VIDYARTHI VELUGU MAGAZINE**

SCAN ME

**Annual (Hard+Soft copy)**
Students -150/-
Graduates - 300/-

**For 3 Years (Hard+Soft copy)**
Students - 450/-
Graduates - 900/-

**Life (10 Years - Hard+Soft copy)**
Students & Graduates - 2000/-

**Overseas (10 Years - Soft copy)**
Students & Graduates - 2000/-

**Publication Trust Account**

Name - UESI PUBLICATION TRUST
Bank - Canara Bank
A/C No - **0624101037187**
Branch - Pragathinagar
IFSC code - CNRB0004173

Kindly inform the office after depositing amount.
Ph. **8985482388**

**Please furnish the following details**

Address, Pincode, Phone Number, Mail Id, Payment Transaction Details


**THEMES:**

Sep - Grow in Character
Oct - Purpose Driven

Please send your writeups on or before **10th of every month** to editorvv2018@gmail.com

## పాఠకుల స్పందన ...

ప్రియమైన విద్యార్థి వెలుగు పాఠకులకు మనవి. ప్రతినెల వివిలో వచ్చే ఆర్టికల్స్ మీద మీ సూచనలను, నేర్చుకున్న విషయాలు **పాఠకుల స్పందన ...** కు editorvv2018@gmail.com లేక 9491595765 (వాట్సాప్) ద్వారా పంపించగలరు.

## విషయ సూచిక


| | |
|---|---|
| వెలుగుగా జీవించు | 4 |
| ఇతరులకు సేవ చేయుట | 7 |
| సువార్తను పంచుకోవడం | 10 |
| క్రీస్తులో స్వాతంత్ర్యం | 13 |
| గౌరవంతో పని చేయాలి | 17 |
| మనుష్యుల సాయం వ్యర్థము రా | 20 |
| అబీగయీలు | 23 |
| పరివర్తన సాధ్యమే | 26 |
| నాలోని నేను | 28 |


## విజ్ఞప్తి

ప్రియమైన విద్యార్థి వెలుగు పాఠకులకు రక్షకుడు, ప్రభువునైన యేసుక్రీస్తు నామములో శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ క్రింది విషయాలు గమనించాలని కోరుతున్నాము.

1. అడ్రస్ మారినా, మ్యాగజైన్ రాకపోయినా, నూతన సబ్‌స్క్రిప్షన్, రెన్యువల్ కొరకు ఆఫీస్ స్టాఫ్ బ్రదర్ డి.సాయి కుమార్ (79933 97630) ను సంప్రదించగలరు.
2. విద్యార్థి వెలుగు పోస్టల్ అవాంతరాలు లేకుండునట్లు, అందరూ చదివి ఆత్మీయ మేలు పొందేటట్లు భారంగా ప్రార్థించండి, ప్రోత్సహించండి.

ప్రతి నెల ప్రార్థనాంశాలు **10**వ తారీఖు లోపల ఇ.యు, ఇ.జి.యఫ్‌కు చెందిన ప్రాముఖ్యమైన రెండు స్తుతి మరియు రెండు ప్రార్థనాంశాలను మాత్రమే వివి ప్రేయర్ పాయింట్స్ లింక్ ద్వారా పంపించగలరు. రచనపై ఆసక్తి కలిగిన వారు తమ వ్యాసములు, కథలు, కవితలు editorvv2018@gmail.com కు పంపించగలరు.

- విద్యార్థి వెలుగు ఎడిటోరియల్ బోర్డ్



# వెలుగుగా జీవించు

"మీరు మూర్ఖమైన వక్రజనము మధ్య, నిరపరాధులును నిష్కళంకులును అనింద్యులునైన దేవుని కుమారులగునట్లు, సణుగులును సంశయములును మాని, సమస్త కార్యములను చేయుడి. అట్టి జనము మధ్యను మీరు జీవవాక్యమును చేతపట్టుకొని, లోకమందు జ్యోతులవలె కనబడుచున్నారు" – ఫిలిప్పీ 2:15బి-16ఏ.

ఆకాశం ఎంత చీకటిగా ఉంటే, నక్షత్రాలు అంత ప్రకాశంగా కనిపిస్తాయి. ఇదే అద్భుత దృశ్యాన్ని పౌలు ఫిలిప్పీ 2:14-16 వచనాలలో పేర్కొంటూ, విశ్వాసులు ఈ లోకంలో విభిన్నంగా జీవించేందుకు పిలవబడ్డారని సంఘానికి స్పష్టంగా గుర్తు చేస్తున్నాడు. అంటే పాపం, స్వార్థం, నిరాశతో నిండిన చీకటి ప్రపంచంలో మనం దేవుని వెలుగును ప్రతిబింబించాలని దీని అర్థం.

యుఇయుఎస్ఐ తెలంగాణ విద్యార్థులుగా, గ్రాడ్యుయేట్లుగా, స్టాఫ్‌గా మనం ఈ పిలుపును స్వీకరించిన వారమైన మనకు ఇది ఒక అందమైన ప్రోత్సాహక వాక్యం మాత్రమే కాదు ఇది మనందరి ఉమ్మడి లక్ష్యం. దేవుడు మనలను క్యాంపస్‌లలో, కార్యాలయాల్లో, సమాజంలో ఆయనకు సాక్షులుగా ఉండమని పిలిచాడు.

అయితే, మన దైనందిన జీవితంలో మనం ఎలా వెలగాలి (ప్రకాశించాలి)?

## 1. భిన్నమైన వెలుగుగా జీవించాలి

పౌలు ఆశ్చర్యకరంగా సరళమైన సూచనతో తన మాటలు ప్రారంభిస్తాడు: "సణుగులును, సంశయములును మాని, సమస్త కార్యములను చేయుడి." ఇది నేటి కాలంలో ఎంతో ప్రత్యేకంగా నిలిచే ఆజ్ఞ. ఎందుకంటే మన సంస్కృతిలో ఫిర్యాదులు, కలహాలు విపరీతంగా ఉన్నాయి. మనం సణుగుటకు బదులుగా కృతజ్ఞతను, కోపానికి బదులుగా శాంతిని ఎంచుకున్నప్పుడు, నక్షత్రాల వలె ప్రకాశిస్తాము (వెలుగుతాము).

విద్యార్థులుగా, పరీక్షల సమయంలో రాజీపడకుండా ఉండటం, అధ్యాపకులను గౌరవించడం, జూనియర్స్‌కు సహాయం చేయడం, ప్రజాదరణ లేకున్నా సత్యం కోసం నిలబడటం ఇవే అసలైన వెలుగు. గ్రాడ్యుయేట్లుగా కార్యాలయాల్లో నిజాయితీ చూపించడం, సేవకునిగా నాయకత్వం వహించడం, నైతిక నిర్ణయాలు తీసుకోవడం ద్వారా

మనం ఈ వెలుగును జీవితం ద్వారా వ్యక్తపరచ వచ్చు.

స్టాఫ్‌గా, క్రీస్తు వంటి వినయం, సేవాతత్వాన్ని కన పరచడం ద్వారా ఈ వెలుగును ఇతరులకు చూపిం చవచ్చు. ప్రతి విధేయత కార్యం, ఒక నిప్పు రవ్వలా ఇతరులను క్రీస్తు వెలుగువైపు చూపుతుంది.

## 2. జీవ వాక్యాన్ని గట్టిగా పట్టుకోవాలి

నక్షత్రాలు తమలో ఉన్న అగ్ని కారణంగా ప్రకాశి స్తాయి. మన విషయానికొస్తే, మనలో ఉండే ఆ అగ్ని దేవుని వాక్యమే. పౌలు ఇలా హెచ్చరిస్తు న్నాడు: “జీవ వాక్యాన్ని గట్టిగా పట్టుకొనుము” అంటే వాక్యాన్ని తెలుసుకోవడమే కాక, దానిని ఆచరించాలి.

మార్కులు, విజయాలు, సామాజిక ఒత్తిళ్లు ఇవన్నీ కాకుండా, మన గుర్తింపు దేవుని వాక్యం ఆధారంగా ఉండాలి. మన కుటుంబాలను, కెరీర్‌ను, పరిచర్యను లేఖనాల పునాదిపై నిర్మిద్దాం. దేవుని వాక్యం మన ఆలోచనలకు, నిర్ణయాలకు ఇంధనంగా మారినప్పుడే మన జీవితాలు స్థిరంగా ప్రకాశించే దీపాలవలె మారతాయి.

## 3. నిజమైన విశ్వాసం, నిజమైన సాక్ష్యం

నిజమైన సాక్ష్యం ఎల్లప్పుడూ బహిరంగ పరిచర్య ద్వారా వెల్లడికాదు. చాలా తరచుగా, అది వ్యక్తిగత నిర్ణయాలలో కనిపిస్తుంది. లంచాన్ని తిరస్కరించే విద్యార్థి, అన్యాయం జరిగినప్పుడు క్షమించే గ్రాడ్యుయేట్, గుర్తించబడనప్పటికీ విశ్వాసంగా సేవ చేస్తూనే ఉండే ఒక స్టాఫ్ వీరే నిజమైన క్రీస్తు సాక్ష్యాన్ని చూపేవారు.

పౌలు వెలుగును ప్రకాశింపజేయమనే పిలుపు ప్రదర్శన గురించి కాదు, పట్టుదల కోసం. మన చుట్టూ ఉన్నవారు మన వాక్చాతుర్యం కంటే మన సహనాన్ని, మన ఆర్భాటం కంటే మన నిరీక్షణను గమనిస్తారు. ఆ విధంగా నిజమైన విశ్వాసం, నిజ మైన సాక్ష్యం ఇతరులను క్రీస్తు వైపు ఆకర్షిస్తుంది.

## 4. సంబంధాల ద్వారా సాక్ష్యమివ్వాలి

యేసుక్రీస్తు ప్రజలతో సాన్నిహిత్యంగా జీవించాడు. వారితో కలిసి నడిచాడు, వారి మాటలు విన్నాడు, వారితో భోజనం చేశాడు, వారి బాధను పంచు కున్నాడు. మనం కూడా ఇతరులతో ఎటువంటి దురుద్దేశ్యం లేకుండా ప్రేమ చూపించి, షరతుల్లేని శ్రద్ధను వహించినప్పుడే వెలుగుగా జీవిస్తాము.

విద్యార్థులుగా ఇతరులను బైబిల్ స్టడీకి మాత్రమే కాక, మన జీవితాల్లోకి ఆహ్వానించాలి. గ్రాడ్యుయే ట్స్‌గా, మన విద్యార్థులు, యంగ్ గ్రాడ్యుయేట్లు, సహో ద్యోగులు, పొరుగువారు మన విశ్వాసాన్ని మన వైఖరుల ద్వారా, మన క్రియల ద్వారా సాక్ష్యమివ్వాలి. స్టాఫ్‌గా, మన గృహాలు, జీవితాలు కృపతో నిండిన బహిరంగ ప్రదేశాలుగా ఉండాలి. శిష్యత్వమనేది సంబంధాల ద్వారా ప్రవహిస్తుంది.

## 5. జ్వాలను నిరంతరం రగుల్కొల్పండి

నక్షత్రాలు మండే శక్తితో వెలుగుతాయి. అలాగే మనం క్రీస్తు కోసం వెలగాలంటే, దేవునితో గడిపే సమయం, ఆత్మీయ క్రమశిక్షణ, విశ్రాంతి, జవాబుదారీతనం (ఆత్మీయ పర్యవేక్షణ) ద్వారా క్రమం తప్పకుండా కొత్త శక్తిని నింపుకోవాలి.

కొన్నిసార్లు, మనం పొలములో పని (పరిచర్య) చేయడం వల్ల కాదు కాని, అంతులేని కమిటీ సమావేశాలు, వివాదాలు లేదా పనితీరు ఒత్తిడి కారణంగా మసిబారుతుంటాము. సంస్థాగత పనులు, ముఖ్యమైనవే, కానీ అవి క్రీస్తుతో మనకున్న సన్నిహిత సంబంధానికి ఎన్నటికీ ప్రత్యామ్నాయం కాకూడదని గుర్తుంచుకుందాం.

కాబట్టి మనం ఒంటరిగా వెలగడానికి ప్రయత్నించ కూడదు. మన ఇయు, ఇజియఫ్, లేదా ప్రార్థనా సమూహాల సహవాసంలో పాతుకుపోదాం. పరిచర్యలో మెంటార్స్‌తో, మెంటీలతో సన్నిహి తంగా నడుద్దాం. మనం ఒంటరిగా వెలిగే దాని కంటే కలిసి ఉన్నప్పుడు మరింత వెలుగునిస్తాం. అలాగే, దేవుని వాక్యం, ఆయన సన్నిధి నుండి నిరంతరం శక్తిని పొందుకున్నప్పుడూ మనం ఎక్కువ కాలం వెలగగలం.

## 6. యుఇయస్ఐలో వెలిగిన నక్షత్రాల వారసత్వం

ఈ పిలుపు మనకే మొదటిసారిగా ఇవ్వబడలేదు. మనకు ముందుగా ఉన్న యుఇయస్ఐ పితరులు

ప్రొఫెసర్ ఇనాక్, బ్రదర్ దీనబంధు, ప్రొఫెసర్ ఇ. స్టాన్లీ, బ్రదర్ చాందపిళ్ళ, బ్రదర్ సత్మోర్తి, బ్రదర్ పి.సి. వర్గీస్ వంటి ఎందరో గొప్పవారు మనకంటే ముందే ఈ బైబిల్ వచనాన్ని (ఫిలిప్పీ 2:15బి–16ఏ) తమ జీవితాల్లో ఆచరించి చూపించారు. వారు తమ తరంలో, త్యాగపూరితమైన ప్రేమ, బైబిలు సత్యాలపై లోతైన విశ్వాసంతో, ఏమాత్రం రాజీపడని చిత్తశుద్ధితో వెలుగుగా జీవించారు.

తెలంగాణ రాష్ట్రంలో, అనేక మంది యుఇయఫ్ఐ గ్రాడ్యుయేట్లు, స్టాఫ్ సువార్తను చేరుకోని కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు, చిన్న పట్టణాల నుండి పెద్ద నగరాల వరకు తీసుకువెళ్లడానికి తమ వ్యక్తిగత సౌకర్యాలను విడిచిపెట్టారు. కొందరు తమ సొంత ఖర్చులతో ప్రయాణించి, విద్యార్థుల హాస్టళ్ళలో బస చేసి, వ్యక్తిగతంగా అనేక మందిని దేవుని మార్గంలో నడిపించి, బలమైన, శాశ్వతమైన సహవాసాలను స్థాపించారు. వారి పేర్లు బహుశా లోకానికి పెద్దగా తెలియకపోవచ్చు, కానీ వారి వారసత్వం శాశ్వతంగా నిలిచిపోతుంది. వారు దేవుని జీవ వాక్యాన్ని గట్టిగా పట్టుకొని తర్వాతి తరానికి అంటే మనకు అందించారు.

ఇప్పుడు మన వంతు వచ్చింది. దీనిని మనం ఏమాత్రం తేలికగా తీసుకోకూడదు. మనం వారి అడుగుజాడల్లో నడుస్తూ సాక్ష్యపు బాటెన్‌ను పట్టుకుంటున్నాం. మనం ప్రశంసల కోసం కాకుండా, దేవుని మహిమ కొరకు వెలగాలి. మనం కూడా పౌలు చెప్పినట్లుగా, “నేను వ్యర్థముగా పరుగెత్త లేదనియు, నేను పడిన కష్టము నిష్ప్రయోజనము కాలేదు” అని చెప్పగలిగే రోజు వరకు మనం క్రీస్తు కోసం వెలుగుతూనే ఉండాలి.

## 7. మన స్థానంలో వెలుగుదాం

వెలుగుగా జీవించడానికి మనం ప్రసిద్ధులం కానవసరం లేదు. దేవుడు మనలో ప్రతి ఒక్కరినీ ఒక నిర్దిష్ట కళాశాలలో, కార్యాలయంలో, లేదా పట్టణంలో ఒక ఉద్దేశ్యంతో ఉంచాడు. ఆకాశంలో నక్షత్రాలు ఒకదానితో ఒకటి పోటీ పడకుండా, తమ తమ స్థానాల్లో వెలుగుతున్నట్లుగా (ప్రకాశిస్తునట్లుగా), మనం కూడా దేవుడు మనల్ని ఉంచిన చోటే వెలుగుగా జీవించాలి.

కాబట్టి, మన ఇయులో, ఇజియఫ్‌లో నమ్మకంగా, చురుకుగా ఉంటూ దేవుడు మనకిచ్చిన పిలుపుకు అంకితమై ఉందాం. ఇతరులు మనలో క్రీస్తు వెలుగును చూడాలని అనుకుంటే, అది కేవలం ప్రత్యేక క్షణాల్లో కాదు కానీ మన విశ్వాసం, సత్యం, ప్రేమతో కూడిన స్థిరమైన, దైనందిన జీవితం ద్వారా చూడాలి.

## ముగింపు

ఈ లోకానికి మరింత గందరగోళం, శబ్దం అవసరం లేదు. దానికి అవసరమైనది ఒక్కటే. అదే నిజమైన వెలుగు. మనం ఎంత నిజాయితీగా ఉన్నాం, దేవునికి నిశ్శబ్దంగా ఎలా లోబడుతున్నాం, ప్రతిరోజూ మనం తీసుకునే చిన్న చిన్న నిర్ణయాలే ఎంతో ప్రాముఖ్యమైనవి. ఎందుకంటే, ఎవరో ఒకరు మన జీవితాలను గమనిస్తూ ఉండవచ్చు. ఎవరో ఒకరు నిజమైన ఆశ కోసం, మార్గం కోసం వెతుకుతూ ఉండవచ్చు.

అలాంటి వారిని, మన నిజమైన, క్రీస్తుతో సారూప్యమైన జీవితం ద్వారా యేసు అనే మహోన్నత వెలుగు వైపు నడిపించవచ్చు. కాబట్టి, విద్యార్థులుగా, గ్రాడ్యుయేట్లుగా, స్టాఫ్‌గా మనం నక్షత్రాలవలె వెలుగుతూనే జీవించాలి. కేవలం ఒక కాలానికి మాత్రమే కాదు, జీవితాంతం క్రీస్తు కోసం వెలుగుతూనే ఉండాలి.

## బిబ్లియోగ్రఫీ అండ్ రిఫరెన్స్


1. పవిత్ర బైబిలు: ఫిలిప్పీ 2:14–16 మత్తయి 5:14–16; దానియేలు 6; 1 పేతురు 2:12.
2. జాన్ స్టాట్, ది కంటెంపరరీ క్రిస్టియన్
3. ఓస్ గిన్నిస్, ది కాల్: ఫైండింగ్ అండ్ ఫుల్ఫిల్లింగ్ గాడ్ పర్పస్ ఫర్ యువర్ లైఫ్
4. డి.ఎ.కార్సన్, బేసిక్స్ ఫర్ బిలీవర్స్: యాన్ ఎక్స్‌పోజిషన్ ఆఫ్ ఫిలిప్పీన్స్
5. యూజీన్ పీటర్సన్, ఎ లాంగ్ ఒబీడియన్స్ ఇన్ ది సేమ్ డైరెక్షన్



**– ఆర్. లక్ష్మణ్ తేజ,** ఈస్ట్ జోనల్ సెక్రటరీ/ బీహార్ ఇజియఫ్ స్టేట్ స్టాఫ్ ఇన్‌ఛార్జ్, పాట్నా



# ఇతరులకు సేవ చేయుట

**"మీలో గొప్పవాడగుటకు కోరువాడు మీ పరిచారకుడై యుండవలెను; మనుష్యకుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా తన ప్రాణమును విమోచనక్రయముగా ఇచ్చుటకును వచ్చెను." (మత్తయి 20:27-28).**

సేవను పొందడం ఎంతో సులభం, కానీ ఈ పతనమైన లోకంలో సేవ చేయడం ఎంత కష్టం! పసిపిల్లలు, చిన్నపిల్లలకు సేవ, సంరక్షణ తప్పని సరి. వారు తిరిగి సేవ చేయలేరు. మనలో కొంత మంది క్రైస్తవులు ఆ పసిపిల్లల వలె సేవ, సంరక్షణ, శ్రద్ధ కోసం ఏడుస్తూ ఉంటారు! ప్రభువులో ఎదిగిన తరువాత కూడా, కొందరు అపరిపక్వమైన పిల్లల వలె, తమకు సేవ చేయబడాలని పట్టుబడతారు.

"సంఘంలో నాకు ఆశించిన గౌరవం దొరకడం లేదు, నన్ను ఎందుకు విస్మరిస్తున్నారు? ప్రజలు నాకు మర్యాద ఇవ్వాల్సిన అవసరం లేదా?" వంటి ప్రశ్నలు వేసే విశ్వాసులను చాలా మందిని చూస్తు ఒటాం. అలాంటివారు, మనం ఎప్పుడూ కేవలం పొందేవారంగానే ఉండలేం, మనం కూడా ఇతరులకు సేవ చేయాలనే విషయాన్ని మరచి పోతారు!

దేవుని పరిచర్యను సమర్థవంతంగా చేయాలంటే, మనకు నిజమైన సేవకుని స్వభావం ఉండాలి. అలాంటి హృదయం ఉన్నవారు తమ సొంత ఆశలను, ప్రణాళికలను పక్కన పెట్టి, క్రీస్తు లక్ష్యాన్ని నెరవేర్చడానికి ప్రాధాన్యత ఇస్తారు. పైన ఉదహరించిన బైబిలు వచనంలో యేసు ప్రభువు స్వయంగా చెప్పినట్లుగా, సంఘంలో అత్యుత్తమ నాయకుడంటే ఇతరులకు సేవ చేయడానికి తనను తాను అంకితం చేసుకున్నవాడే. ఇది నాయకత్వానికి ఉన్న అసలైన ప్రమాణం.

## ప్రభువును సేవించాలన్న బైబిలు ఆదేశం

ద్వితీ 10:12లో, "ఇశ్రాయేలూ, నీ దేవుడైన యెహోవాకు భయపడి, ఆయన మార్గమున్నిటిలో నడిచి, ఆయనను ప్రేమించి, నీ పూర్ణహృదయము తోను నీ పూర్ణాత్మతోను నీ దేవుడైన యెహోవాను సేవించి, ఆయన ఆజ్ఞలను కట్టడలను అనుస రించుము" అని చూస్తాం.

"సంతోషముతో యెహోవాను సేవించుడి; ఉత్సా హగానము చేయుచు ఆయన సన్నిధికి రండి" (కీర్తన 100:2). మన పూర్ణహృదయముతో, సంతో షముతో దేవుని సేవించడానికి మనం పిలువబ డ్డాం, ఇది చాలా మంది క్రైస్తవులు వాస్తవంగా సేవ చేస్తున్న తీరుకు, ఈ ఆజ్ఞకు చాలా తేడా ఉంది!

అయితే, మోషే, యిర్మీయా, సీమోను పేతురు వంటి వారిని మనం చూస్తే, వారు మొదట్లో దేవుని సేవించడానికి కొంత వెనుకాడారు, సంశయించారు. కానీ తర్వాత వారు దేవుని సేవించడానికి తమ వ్యక్తిగత క్షేమాన్ని, ప్రాణాలను సైతం లెక్క చేయ కుండా, అనేక ప్రమాదాలను ఎదురైనా గొప్ప త్యాగాలు చేశారు.

## సేవ చేయాలనే బైబిలు ఆజ్ఞ

"సహోదరులారా, మీరు స్వాతంత్ర్యమునకు పిలువబడితిరి గాని, మీ స్వాతంత్ర్యమును శరీర కార్యములకు హేతువుగా నుంచుకొనక, ప్రేమతో ఒకరికొకరు దాసులుగా ఉండుడి" (గలతీ 5:13).

ఈ వచనంలో పౌలు, గలతీయుల సంఘానికి చాలా స్పష్టమైన సందేశాన్ని ఇచ్చాడు. క్రీస్తు మనకు పాపం నుండి, ధర్మశాస్త్రం నుండి స్వాతంత్ర్యాన్ని ఇచ్చాడని, దానికి మనం పిలువబడ్డామని గుర్తు చేస్తున్నాడు. అయితే, ఈ స్వాతంత్ర్యాన్ని శరీర కోరి కలను నెరవేర్చుకోవడానికి ఒక సాకుగా ఉపయోగి ంచుకోకూడదని హెచ్చరించాడు. బదులుగా, మనం ప్రేమతో ఒకరికొకరు సేవకులుగా ఉండాలని, అంటే నిస్వార్థంగా ఇతరులకు సహాయం చేయాలని బోధించాడు. నిజమైన స్వాతంత్ర్యం అంటే మన ఇష్టానుసారం జీవించడం కాదు, ప్రేమతో ఇతరులకు సేవ చేయడంలోనే అది వ్యక్తమవు తుందని ఈ వచనం నొక్కి చెబుతుంది.

## సేవ ఒక దీవెనేనా?

యేసు తన శిష్యులకు ఎందుకు సేవ చేశాడు? ఆయన నామానికి దుఃఖాన్ని, అగౌరవాన్ని, చెడ్డపేరును తెచ్చే వ్యక్తుల జీవితాల పట్ల ఆయన కెందుకు అంత ఆసక్తి? దీనికి కారణం, యేసు మానవ సంబంధాలకు అత్యంత విలువనిస్తాడు. ఆయన తన ప్రతి బిడ్డను, వారి స్థితితో సంబంధం లేకుండా, అమూల్యమైన వారిగా చూస్తాడు. ఆయన సర్వశక్తిమంతుడు, అన్ని తెలిసినవాడైనప్పటికీ, తనను తాను తగ్గించుకొని ఒక సేవకుని వలె జీవించడానికి ఇష్టపడ్డాడు. అంతేకాదు, మనం కూడా ఆయన వలెనే సేవకులుగా జీవించాలని ఆయన ఆశిస్తున్నాడు (లూకా 17:7-10).

"నీవు ఇతరులకు సేవ చేసే వరము పొందితే, దానిని చక్కగా చేయి..." (రోమా 12:7)

మన పొరుగువారి కంటే ఒక అడుగు ముందు ఉండటానికి మనం ఏదైనా చేస్తాం. మనం ప్రాకు లాడుతాం, సణుగుతాం, కుట్రలు చేస్తాం, అణిచి వేస్తాం లేదా పైస్థాయికి చేరుకోవడానికి వ్యూహాలు పన్నుతాం. ఈ ధోరణి పాఠశాలలు, కళాశాలలు, చర్చిలు, కార్యాలయాలు, రాజకీయాలు మొదలైన వాటిలో జరుగుతూ ఉండటం మనం చూస్తాం. ప్రజలు పదోన్నతి కోసం ఒత్తిడి చేస్తారు, సమస్యల నుండి బయటపడటానికి మృదువుగా మాట్లాడతారు లేదా తమ చుట్టూ ఉన్నవారిని దెబ్బతీయడం ద్వారా పైకి చేరుకుంటారు.[1]

ఆస్వాల్డ్ ఛాంబర్స్ రాసిన ఒక పుస్తకం నుండి నాకు ఒక అద్భుతమైన మాట గుర్తుకు వచ్చింది: "దేవా,

నా బలహీనమైన స్వరంతో సుఖాన్ని, విశ్రాంతిని, ఆనందాన్ని కోరుకునే పిరికివాడనైన నాపై నన్ను కఠినం చేయి. నాకే ద్రోహి అయిన నేను, నా దొంగ స్నేహితుడు, నా ప్రాణాంతక శత్రువు, నేను ఏ దారిలో వెళ్ళినా నాకు అడ్డుపడేవాడను." [2]

చాలాసార్లు, దేవుని సేవించడంలో మనమే మనకు గొప్ప శత్రువులం. అయితే, దేవుని సేవ చేయడంలో గొప్ప ఆశీర్వాదం ఉందని బైబిలు స్పష్టంగా చెబుతోంది. 1 కొరింథీ 15:58 వచనంలో, ప్రభువులో మన కష్టం వ్యర్థం కాదని, అది ప్రతిఫలాన్ని ఇస్తుందని హామీ ఇవ్వబడింది. అలాగే, మత్తయి 25:21లో, నమ్మకమైన సేవకుడు తన యజమాని ఆనందంలో ప్రవేశిస్తాడని యేసు ప్రభువు చెప్పడం ద్వారా, సేవ ద్వారా వచ్చే ఆశీర్వాదాన్ని నొక్కి చెబుతుంది.

## యేసు వలె సేవకుని హృదయాన్ని పెంపొందించుకుందాం

"దేవుని నానావిధమైన కృపవిషయమై మంచి గృహనిర్వాహకులైయుండి, యొక్కొకడు కృపావరము పొందిన కొలది యొకనికొకడు ఉపచారము చేయుడి" (1 పేతురు 4:10).

ప్రభువును యుగయుగములు సేవించే గొప్ప ఆధిక్యత మనకు ఉంది (ప్రకటన 22:3). దేవుడు మనలో ప్రతి ఒక్కరికీ ఇతరులకు సేవ చేయడానికి ఒక వరాన్ని అనుగ్రహించాడు! అది మన స్వార్థ ప్రయోజనాల కోసం కాదు, మనల్ని మనం ఇతరుల దృష్టిలో, వారు లోకస్తులైనా లేక విశ్వాసులైనా, గొప్పగా చూపించుకోవడానికి కాదు. మరి క్రీస్తు వైఖరి ఏమిటి? ఆయన తనను తాను తగ్గించుకొని, మనలాంటి ఏ మాత్రం యోగ్యత లేని అనేక మందికి విమోచన క్రయధనంగా తన ప్రాణాన్ని ఇచ్చాడు.

"అయినను ఆయన దేవునితో సమానముగా నుండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని, తనను తానే రిక్తునిగా చేసికొని, దాసుని (గ్రీకులో: బానిస) స్వరూపమును ధరించుకొని, మనుష్యుల పోలికగా పుట్టెను." (ఫిలిప్పీ 2:7)

మనం ఆలోచిస్తే, 'జీవించిన వారిలోకెల్లా గొప్ప వ్యక్తి తాను సేవ చేయించుకోవడానికి కాక, సేవ చేయడానికి వచ్చానని ఎందుకు చెప్పాడు?' ఆయన కోరుకుంటే పాలకునిగా రాగలిగేవాడు. కానీ బానిసగా ఆయన అవతరించడం ద్వారా, క్రీస్తు సేవించడంలో ఉన్న ప్రాముఖ్యతను తెలియ జేస్తాడు!

కాబట్టి ప్రియ సహోదర సహోదరీలారా, అది ప్రభువును సేవించడమైనా లేక ఇతరులకు సేవ చేయడమైనా, మన సేవ గురించి ప్రార్థనాపూర్వకంగా నిర్ణయించుకొని పూర్ణ హృదయంతో, నిజాయితీగా ఉందాం. ఇక "ఫుల్ టైం" లేదా "పార్ట్ టైం" సేవ విషయానికి వస్తే, ఆ వ్యత్యాసం విలువకు సంబంధించినది కాదు, అది కేవలం పనితీరుకు సంబంధించినది అని గుర్తుంచుకుందాం. ఆదర్శవంతమైన సేవ అంటూ ఏమీ లేదు, కానీ మనం ప్రభువుకు సమర్పించు కొని, ఆయన కొరకు కనిపెట్టినప్పుడు, ఆయన తన సేవలోకి మనల్ని నడిపిస్తాడు. ప్రభువు మనల్ని ఆశీర్వదించి, ఆయనకు తగినట్లుగా తన సేవలో మనల్ని వాడుకొను గాక!

## రిఫరెన్స్


[1] – పాస్టర్ వాలెస్ పేర్కొన్నారు, మోరావియన్ చర్చి

[2] – స్పిరిచ్యువల్ లీడర్‌షిప్, ఆస్వాల్డ్ సాండర్స్ జె., మూడీ బైబిల్ ఇన్‌స్టిట్యూట్, మూడీ ప్రెస్, చికాగో, యూఎస్ఏ.



**– జి. సాల్మన్ జితేందర్,** విద్యానగర్ జోన్, హైదరాబాద్. వీరు బ్యాంక్ ప్రొబేషనరీ ఆఫీసర్‌గా పనిచేసిన తర్వాత వరల్డ్ విజన్ ఇండియాలో వివిధ స్థాయిలలో పనిచేశారు.



ప్రోత్సాహం

# సువార్తను పంచుకోవడం

విశ్వాసులు తమ జీవితాలలో చేపట్టగలిగే అత్యంత ముఖ్యమైన బాధ్యతలలో మరియు పొంద గలిగే గొప్ప ఆధిక్యతలలో సువార్తను పంచు కోవడం ఒకటి. ఇది మాటలకు అతీతమైన ఒక దైవిక పిలుపు. మన చుట్టూ ఉన్న ప్రజలకు దేవుని అద్భుతమైన ప్రేమ యొక్క రూపాంతరపరిచే శక్తిని, ఆయన ద్వారా లభించే రక్షణను తెలియజేయడమే దీని పరమార్థం. సువార్త కేవలం ఒక సాధారణ వార్త మాత్రమే కాదు; అది నిజమైన నిరీక్షణకు, పాపవిమోచనకు, మరియు క్రీస్తులో లభించే నూతన జీవితానికి సారం.

రోమా 1:16 లో, అపొస్తలుడైన పౌలు ఇలా పేర్కొన్నాడు: “సువార్తను గూర్చి నేను సిగ్గుపడుట లేదు; ఏలయనగా నమ్ము ప్రతివానికి, మొదట యూదునికి, తరువాత గ్రీసు దేశస్థునికి రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తి.” ఈ శక్తివంతమైన ప్రకటన దేవుని నీతిని బయలుపరచడానికి, పాపులకు ఆయన రక్షణ శక్తిని అందుబాటులో ఉంచడానికి సువార్తకున్న సామర్థ్యాన్ని నొక్కి చెబుతుంది. ఇది కేవలం శుభవార్త కాదు; అది జీవితాలను రూపాంతర పరిచే ఒక దైవిక శక్తి, క్షమాపణను, దేవునితో సమాధానాన్ని, నిత్యజీవ వాగ్దానాన్ని అందిస్తుంది. యేసుక్రీస్తు యొక్క జీవితం, మరణం, పునరుత్థానం కలిగి ఉన్న ఆయన సందేశం జీవితాలను మార్చగల, వ్యక్తులను దేవునితో సరైన సంబంధంలోకి పునరుద్ధరించగల అతీతమైన సామర్థ్యాన్ని కలిగి ఉంది. సువార్త సందేశాన్ని పంచుకోవడం ద్వారా, ఇతరులు విశ్వాసం ద్వారా, పశ్చాత్తాపం ద్వారా యేసుక్రీస్తు ప్రేమను అనుభవించడానికి మనం ఆహ్వానిస్తాం, తద్వారా వారికి నిరీక్షణను, సమాధానాన్ని, నూతన గుర్తింపును అందించి, అంతిమంగా వారిని నూతన సృష్టిగా మారుస్తాం. సువార్తను పంచుకోవడం ఆత్మీయ అంధకారం

యొక్క సంకెళ్లను తెంచుతుంది, వ్యక్తులను నిరాశ నుండి జీవితపు వెలుగులోకి నడిపిస్తుంది.

### సువార్తను సమర్థవంతంగా ఎలా పంచుకోవాలి?

సువార్తను సమర్థవంతంగా పంచుకోవడం విశ్వాసులకు ఒక గొప్ప అవకాశం మరియు బాధ్యత. ఇది సరైన మాటలు కలిగి ఉండటం కాదు, ప్రేమతో సత్యాన్ని మాట్లాడటం మరియు పరిశుద్ధాత్మ ద్వారా నడిపించబడటం. దేవుడు మాత్రమే హృదయాలను మార్చగలడు, అందుకే ప్రార్థన అత్యవసరం. శుభవార్తను పంచుకోవడానికి అవకాశాల కోసం (కొలొస్స 4:3), ధైర్యం కోసం (ఎఫెసీ 6:19), మనం మాట్లాడేవారి హృదయాలు సందేశాన్ని స్వీకరించడానికి తెరవబడాలని (అపో. కార్య. 16:14) మనం ప్రార్థించాలి.

శుభవార్తను పంచుకునే ప్రక్రియలో, స్నేహాలను పెంచుకోవడం, మంచి ప్రశ్నలు అడగడం, వాదనలను నివారించడం మరియు ప్రేమతో, గౌరవంతో పంచుకోవడం ముఖ్యం. మీరు ముందుకు సాగుతున్న కొద్దీ, యేసుక్రీస్తును వెంబడించాలని నిర్ణయం తీసుకోవడానికి వ్యక్తులను ఆహ్వానించాలి. ఎవరైనా ఆయనను వెంబడించాలని నిర్ణయించుకున్నాక, వారిని శిష్యత్వపు మార్గంలో నడిపించాలి. ఒకవేళ వారు నిబద్ధత చూపకపోతే, ప్రార్థనను చేస్తూ, స్నేహాన్ని నిలబెట్టు కుంటూ, దేవుని సమయం కోసం వేచి చూడాలి.

సువార్తను సమర్థవంతంగా పంచుకోవడానికి వివిధ నమూనాలు ఉన్నాయి. అటువంటి ఒక నమూనా జాన్ స్టాట్ యొక్క ఏబిసిడి మోడల్ [1], ఇందులో నాలుగు ముఖ్యమైన దశలు ఉన్నాయి:

* **ఒప్పుకోవాలి (Admit):** పాపాన్ని మరియు రక్షకుడి అవసరాన్ని గుర్తించడం.
* **నమ్మాలి (Believe):** క్రీస్తు మన పాపాల కోసం మరణించిన దేవుని కుమారుడని గుర్తించడం.
* **పరిగణించాలి (Consider):** ఆయన ప్రభువు అని మరియు విధేయత, పశ్చాత్తాపం, బహిరంగ సాక్ష్యం అవసరమని అర్థం చేసుకోవడం.
* **అంగీకరించాలి (Do):** ప్రార్థనలో ఆయనను ప్రభువుగా మరియు రక్షకుడిగా అంగీకరించడం.

ఈ నమూనా ఒక క్రమమైన విధానాన్ని నొక్కి చెబుతుంది, వ్యక్తిగత పాపాన్ని అంగీకరించడం నుండి ప్రారంభించి, క్రీస్తు త్యాగాన్ని విశ్వసించడం, అవసరమైన నిబద్ధతను పరిగణనలోకి తీసుకోవడం, చివరగా క్రీస్తును అంగీకరించడానికి నిర్ణయం తీసుకునేంత వరకు ఉంటుంది.

### భయం, సంకోచాన్ని అధిగమించడం

సువార్తను పంచుకోవడంలో భయం, సంకోచాన్ని అధిగమించడం చాలా ముఖ్యం, ఎందుకంటే ధైర్యవంతులైన విశ్వాసులు కూడా కొన్నిసార్లు ఆందోళన, భయం, సందేహాలతో సతమతం అవుతారు. సంకోచంగా భావించడంలో మీరు ఒంటరిగా లేరని గుర్తించడం ముఖ్యం; దాదాపు ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో భయం లేదా సంకోచాన్ని అనుభవిస్తారు.

భయాన్ని ఎదుర్కొనే ముందు, దాని మూలాలను అర్థం చేసుకోవడం అవసరం. భయానికి సాధారణ కారణాలు తిరస్కరణ లేదా అపహాస్య భయం, అనర్హులుగా భావించడం లేదా ఏమి చెప్పాలో తెలియకపోవడం, సంబంధాలను దెబ్బతీస్తుందేమోనని ఆందోళన చెందడం, మేధోపరమైన లేదా సాంస్కృతిక వ్యతిరేకతతో భయపెట్టబడటం. ఈ భయాలు నిజమైనవే అయినప్పటికీ, అవి అంతిమం కానవసరం లేదు. దేవుడు సిద్ధంగా ఉన్నవారిని పిలవడు; ఆయన పిలిచిన వారిని సిద్ధపరుస్తాడు. ధైర్యం ఆత్మవిశ్వాసం నుండి కాక దేవునిపై ఉన్న విశ్వాసం నుండి వస్తుంది. సామెతలు 28:1 ఇలా

[1] – బేసిక్ క్రిస్టియానిటీ, జాన్ స్టాట్

చెబుతుంది: "దుష్టులు ఎవరు తరుమకపోయినను పారిపోవుదురు, నీతిమంతులు సింహంవలె ధైర్యముగా నుందురు" దేవుడు మిమ్మల్ని ఇతరుల పట్ల తన ప్రేమతో నింపాలని, మీ మిషన్‌ను మీకు గుర్తు చేయాలని, మీ సొంత శక్తిపై కాకుండా పరిశుద్ధాత్మ శక్తిపై నమ్మకం ఉంచడానికి సహాయం చేయాలని ప్రార్థించండి (అపో. కార్య. 1:8).

యేసుక్రీస్తు కూడా తిరస్కరణను ఎదుర్కొన్నాడు, మనం కూడా ఎదుర్కొంటామని ఆయన మనకు హెచ్చరించాడు (యోహాను 15:18-20). అయితే, ఇది వైఫల్యాన్ని సూచించదు. ఎవరైనా "వద్దు" అని చెప్పినా, మీరు ఒక విత్తనాన్ని నాటారు, దేవుడు తన సమయానికి దానిని పోషించగలడు.

### వ్యక్తిగత సాక్ష్యం యొక్క ప్రభావం

వ్యక్తిగత సాక్ష్యం సువార్తను పంచుకోవడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఉదాహరణకు, నేను తెలంగాణలోని హిందూ ఆచారం పాటించే కుటుంబంలో పుట్టి పెరిగాను. ప్రాథమిక పాఠశాలలో ఉన్నప్పుడు, కొంతమంది మా గ్రామానికి వచ్చి వీధిలో సువార్త ప్రకటించడం ద్వారా నాకు సువార్తతో మొదటి పరిచయం ఏర్పడింది. తరువాత ఉన్నత పాఠశాలలో, నేను రేడియో కార్యక్రమాల ద్వారా సువార్తను విన్నాను, హిందువుగా కొత్త నిబంధనను చదివాను. చివరికి, 1999లో, 17 సంవత్సరాల వయస్సులో ఒక ఇయు విద్యార్థి అయిన బ్రదర్ మార్కు పోలోనియస్, యేసుక్రీస్తు రక్షణ జ్ఞానం వైపు నన్ను నడిపించడంలో వ్యక్తిగత ఆసక్తిని కనబరిచినప్పుడు నేను క్రీస్తుకు నా జీవితాన్ని సమర్పించాను. నేను ఎదుగుతున్న కొద్దీ, గ్రాడ్యుయేట్స్ నా ఆత్మీయ ఎదుగుదలకు తమ సమయాన్ని వెచ్చించారు. ఇతరులు సువార్తను పంచుకున్నారనే వాస్తవం, దక్షిణ భారతదేశంలో ఇతరులతో పంచుకోవడానికి, ఉత్తర భారతదేశంలోని సువార్త చేరని ప్రాంతాలలో ప్రకటించడానికి నన్ను నిరంతరం ప్రోత్సహించింది.

### అవకాశాల కోసం ప్రార్థించడం, దేవుడిని విశ్వసించడం

కొలొస్సయులకు రాసిన తన పత్రికలో, పౌలు ఇలా వ్రాశాడు: "నేను సంకెళ్ళలో ఉన్న క్రీస్తు మర్మమునుగూర్చి మాట్లాడవలసిన రీతిగా దానిని బయలుపరచునట్లు, దేవుడు మాకు వాక్యము చెప్పుటకు ద్వారము తెరచునట్లు మా కొరకును ప్రార్థన చేయుడి" (కొలొస్స 4:3). సువార్తను పంచుకునే ముందు ప్రార్థించడానికి మనం పిలవబడ్డాం. తరచుగా, మనం ప్రార్థనను నిర్లక్ష్యం చేయడం వల్ల పంచుకోవడంలో విఫలమవుతాం. మన ప్రార్థనలు మరియు దేవునిపై విశ్వాసం సువార్తను పంచుకోవడానికి మార్గాలను తెరుస్తాయి మరియు పాపులు తమ జీవితాలను క్రీస్తుకు అప్పగించడానికి మార్గం సుగమం చేస్తాయి. మొరావియన్ 100 సంవత్సరాల ప్రార్థనా ఉద్యమం లోతైన, శాశ్వత ప్రభావాన్ని చూపింది, ప్రపంచ మిషనరీ ఉద్యమాన్ని, ఆధ్యాత్మిక ఉజ్జీవాన్ని, సువార్త వ్యాప్తిని ప్రేరేపించింది. సర్వశక్తిమంతుడైన దేవుడు ప్రార్థించడంలో, ఆయనను విశ్వాసముంచడంలో, సువార్తను పంచుకోవడంలో మనకు సహాయం చేయును గాక.

### ముగింపు

సువార్తను పంచుకోవడం జీవితాలను మార్చగల శక్తివంతమైన కార్యం. దీనికి ధైర్యం, ప్రార్థన మరియు విశ్వాసంతో ముందడుగు వేయాలనే సంకల్పం అవసరం. ఈ పిలుపును స్వీకరించడం ద్వారా, మనం దేవుని ప్రేమ, కృపకు సాధనాలుగా మారి, ఇతరులను యేసుక్రీస్తులో కనుగొనబడే ఆశ, రక్షణ వైపు నడిపించవచ్చు.

**– రెవ. మధుసుదన్ రెడ్డి,**
స్టేట్ సెక్రటరీ, యుఇయస్ఐ – మధ్యప్రదేశ్,
భోపాల్.




# క్రీస్తులో స్వాతంత్ర్యం

స్వాతంత్ర్యం అనే పదం వినగానే మనసులో ఎంతో ఆనందం కలుగుతుంది. అది మనల్ని బంధాల నుండి విడిపించి, స్వేచ్ఛను కలిగించే గొప్ప భావన. ఈ పదం వినగానే మన హృదయాలలో ఒక సరికొత్త ఉత్సాహం నిండిపోతుంది.

కొన్ని దశాబ్దాల క్రితం, స్వాతంత్ర్యం అంటే కేవలం రాజకీయ నిరంకుశత్వం నుండి విముక్తి పొందడం లేదా బానిస యజమానుల చెర నుండి స్వేచ్ఛను సాధించడం. అంతేకాకుండా, బాలికలను చదివించుకునే హక్కు, ఒక సార్వభౌమ దేశంగా స్వయంప్రతిపత్తితో నిలబడే స్వేచ్ఛ వంటివి కూడా స్వాతంత్ర్యం పరిధిలోకి వచ్చేవి.

అయితే, నేటి కాలంలో స్వాతంత్ర్యం అనే భావన రూపాంతరం చెందింది. అది ఇప్పుడు భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ, వ్యక్తిగత ఎంపిక చేసుకునే స్వాతంత్ర్యం గురించి ఎక్కువగా ఉంది. ఉదాహరణకు, మనకు నచ్చిన వృత్తిని ఎంచుకోవడం, జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవడం, జెండర్‌ని ఎంచుకోవడం, ఏ సామాజిక నియమాలను పాటించాలి, వేటిని విస్మరించాలి అని నిర్ణయించుకోవడం వంటివి దీనిలో ఉన్నాయి.

ఈ ఆధునిక దృక్పథంలో, ప్రబలంగా ఉన్న ప్రశ్న ఏమిటంటే, “నేను గరిష్ట వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని ఎలా ఆస్వాదించగలను?” అనేది నేటి మానవుడి ప్రధాన ఆకాంక్షగా ఉంది.

ఎంపిక చేసుకునే హక్కు (ఫ్రీ విల్) దేవుడు స్వయంగా మనకు ప్రసాదించిన గొప్ప గౌరవం. ఇది మానవునికి దేవుడు ఇచ్చిన ఒక ప్రత్యేకమైన వరం, దీని ద్వారా మనం మంచి చెడులను వివేచించి, సొంత నిర్ణయాలు తీసుకోగలం. స్వేచ్ఛగా ఉండాలనే కోరిక మన స్వభావంలోనే అంతర్లీనంగా ఉంది.

మహాత్మా గాంధీ ఇలా అన్నారు, “తప్పు చేయడానికి, పాపం చేయడానికి కూడా స్వేచ్ఛ లేకపోతే, స్వాతంత్ర్యం ఉండడం నిష్ప్రయోజనం” [1] దీని అర్థం ఏమిటంటే, ఒక వ్యక్తికి తప్పులు చేసే అవకాశం, పాపం చేసే స్వేచ్ఛ లేకపోతే, అతని స్వాతంత్ర్యం నిజమైన స్వాతంత్ర్యం కాదు. ఎందుకంటే, నిజమైన స్వేచ్ఛ అంటే ఎంపిక చేసుకొనే అధికారం, ఆ ఎంపికలో తప్పు చేసే అవకాశం కూడా ఉంటుంది.

మనందరికీ తెలిసినట్లుగా ఆదాము, హవ్వలు తమ ఫ్రీ విల్‌తో, దేవుని ఆజ్ఞను ధిక్కరించి పాపం చేయుటకు ఎంచుకున్నారు. వారు అంతకముందు

[1] - యంగ్ ఇండియా, 12-3-1931, పేజీ 31

అపరిమితమైన స్వేచ్ఛను కలిగి ఉన్నప్పటికీ, తమ స్వంత కోరిక మేరకు పాప మార్గాన్ని ఎంచు కున్నారు. అదేవిధంగా, మీరు, నేను కూడా ఫ్రీ విల్‌తో, తెలిసి కొన్ని పాపాలు చేయుటకు ఎంచు కున్నాం.

## ఎంపికల పర్యవసానాలు

మన క్రియలను ఎంచుకునే స్వేచ్ఛ మనకు ఉన్నప్పటికీ, వాటి పర్యవసానాల నుండి మనం తప్పించుకోలేం. స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా వస్తుంది. ఏదేను తోటలో మొదలై, నేటికీ కొనసాగు తున్న ఒక అపోహ ఉంది: అదేమిటంటే, "నా" ఎంపికల పర్యవసానాలను "నేను" అనుభవించను అని. ఒక వ్యక్తి కిటికీలో నుండి దూకాలని "ఎంచుకుంటే", ఆ వ్యక్తికి ఎముకలు విరగడమో లేదా బహుశా ప్రాణం పోవడమో జరుగుతుంది. అతను/ఆమె గురుత్వాకర్షణను ధిక్కరించలేరని మనం ఖచ్చితంగా చెప్పగలం.

మన స్వాతంత్ర్యం ఫలితంగా మనం ఎంచుకునే విషయాలు లేదా స్వాతంత్ర్యాన్ని కనుగొనే మార్గం అని మనం భావించేవే, వాస్తవానికి మనలను బానిసలుగా మార్చగలవు అని మనం జాగ్రత్త పడాలి. అది ఆచారాలు పాటించడం కావచ్చు, మద్యం కావచ్చు, డ్రగ్స్ కావచ్చు, విపరీతమైన అబద్ధాలు చెప్పడం కావచ్చు, అశ్లీల చిత్రాలు చూడటం కావచ్చు, నిరంతరం స్వీయ-ఆనందం పొందడం కావచ్చు, ఒక నిర్దిష్టమైన ఇమేజ్‌ను నిలబెట్టుకోవడం కావచ్చు, ఒక జీవనశైలిని అనుసరించడం కావచ్చు లేదా ఒక సంబంధం కోసం ఆరాటపడటం కావచ్చు. మొదట్లో ఇవన్నీ చాలా ఆనందాన్ని, ఉత్సాహాన్ని ఇస్తాయి. కానీ ఆ ఆనందం తాత్కాలికం. త్వరలోనే ఆ ఆనందాన్ని తిరిగి పొందడం కోసం మనం వాటికి బానిసల వుతాం. మనం ఆ అలవాట్లలోకి ఇంకా లోతుగా వెళ్లి, మనల్ని మనం నాశనం చేసుకుంటాం.

మొదట ఆశగా, ఆనందంగా అనిపించినవి చివ రికి ఒక క్రూరమైన బానిసత్వంగా మారతాయి. ఆ అలవాట్లకు లొంగిపోవడం వల్ల మన హృదయాలు మొద్దుబారతాయి, మనస్సాక్షి చచ్చిపోతుంది.

## పాపపు పట్టును అధిగమించడం

పాపం యొక్క బలీయమైన పట్టుతో అనుదినం మనకు జరిగే పోరాటం వాస్తవం. క్రొత్త నిబంధన




లోని గొప్ప వ్యక్తులలో ఒకరైన అపొస్తలుడైన పౌలు కూడా రోమా 7:15లో తన గురించి ఇలా వ్రాశాడు: "ఏలయనగా నేను చేయునది నేనెరుగను; నేను చేయ నిచ్ఛయించునది చేయక ద్వేషించునదియే చేయుచున్నాను." మనం ఈ పాపపు వలయంలో చిక్కుకొని, చేయకూడదనుకున్న పనులనే పదే పదే చేస్తూ, అవే పనుల వలయంలో చిక్కుకు పోయాము. తృప్తికి బదులుగా, వమనల్ని మనం నిందించుకుంటూ, లోతైన అపరాధభావంలో కూరుకుపోతాము. ఆత్మీయంగా విఫలమయ్యామని, క్రీస్తు ప్రేమకు అనర్హులమని భావిస్తాము. మనం ఓటమిపాలైన, సంతోషం లేని క్రైస్తవులుగా మిగిలిపోతాము.

కానీ శుభవార్త ఏమిటంటే, మనం అలా జీవించా ల్సిన అవసరం లేదు. సిలువ దగ్గర మనందరికీ స్వస్థత, విమోచనం లభిస్తాయి. దేవుని కృపకు అందని వ్యక్తి గానీ, పరిస్థితి గానీ ఏదీ లేదు. ఈ విషయంలో, తమను తాము మెరుగుపరుచు కోవ డానికి నిరంతరం, పట్టుదలగా ప్రయత్నించే వారికి దేవుడు సహాయం చేస్తాడు.

## ఆచరణాత్మకంగా చేయగలిగే కొన్ని విషయాలు:

మన ఆత్మీయ జీవితంలో పాపం లేదా వ్యసనం వంటి సవాళ్లను ఎదుర్కొన్నప్పుడు నిరాశపడకుండా, ప్రభువు కృపతో వాటి నుండి బయటపడటానికి

మనం ఆచరణాత్మకంగా చేయగలిగిన కొన్ని ముఖ్య మైన విషయాలు ఇక్కడ ఇవ్వబడ్డాయి.

ఈ అడుగులు మనకు విమోచన, స్వస్థతను అందించి, దేవుని మార్గంలో స్థిరంగా సాగడానికి సహాయపడతాయి:

* **సమస్యను గుర్తించడం:** మిమ్మల్ని మీరు నిజాయితీగా అంగీకరించండి. వాస్తవాన్ని అంగీ కరించకపోవడం మీకు మరింత హాని చేస్తుంది.
* **బాధ్యత వహించే సహచరుడిని కలిగియుండ డం:** మీకు నమ్మకమైన, మీ పట్ల నిజమైన ప్రేమ, శ్రద్ధ కలిగిన వారిని కనుగొనండి. మీ కష్టాల గురించి, పోరాటాల గురించి వారితో మాట్లాడండి – అలా చేయడం ద్వారా ఆ సమస్య లేదా వ్యసనం మీపై చూపించే ప్రభావం తగ్గుతుంది.
* **మూలాన్ని గుర్తించడం:** పాపంలోకి లేదా వ్యసనంలోకి మిమ్మల్ని నడిపించే విషయాల పట్ల స్పష్టత కలిగి ఉండండి. మిమ్మల్ని బల హీనపరిచిన పరిస్థితులు, మిమ్మల్ని ఆక ర్షించినది ఏమిటో మీరు ఎంత ఎక్కువగా అర్థం చేసుకుంటే, భవిష్యత్ ప్రలోభాలను అంత మెరుగ్గా తట్టుకోగలరు.
* **మీ కోరికలను అదుపు చేసుకోవడం:** మీకు అవాంఛిత కోరికలు కలిగినప్పుడు, వాటిని మళ్లించడానికి ఒక హాబీని లేదా ఏదైనా ప్రత్యా మ్నాయాన్ని కనుగొనండి. అదనంగా, మీరు ఎక్కువగా ప్రలోభానికి గురయ్యే భౌతిక ప్రదేశం నుండి దూరంగా ఉండండి. మీ పరిసరాలను మార్చడం, మీ మనస్సును ఇతర విషయాలపై కేంద్రీకరించడం చాలా ముఖ్యం.
* **తప్పులను సరిదిద్దుకోవడం:** మీరు చేసిన తప్పు లను సరిదిద్దుకోండి. మీ చర్యల వల్ల ప్రజలు బాధపడినా లేదా మోసపోయినా, మాటల ద్వారా లేదా వ్రాతపూర్వకంగా క్షమాపణ చెప్పడం అవసరం. ఇది మీకు మానసికంగా నయం కావడానికి, పరిష్కారాన్ని కను గొన డానికి, ముందుకు సాగడానికి సహాయపడు తుంది.
* **అపజయాలు మిమ్మల్ని నిర్వచించకుండ చూసుకోవడం:** మీ గత తప్పులు మీ భవిష్య త్తును నిర్ణయించ కూడదని గట్టిగా నిర్ణయించు కోండి. మీరు దేవుని దృష్టిలో విలువైనవారు.
* **లేఖనాలను కంఠస్థం చేయడం, గుర్తుచేసుకోవ డం:** లేఖనాలను కంఠస్థం చేయండి. మీకు కష్టంగా అనిపించినప్పుడు లేదా ప్రలోభాలు ఎదురైనప్పుడు, ఆ లేఖనాలను గుర్తు చేసు కోండి. దేవుని వాక్యం అత్యంత శక్తివంతమైన ఆయుధం, అది మిమ్మల్ని స్థిరంగా నిలబె ట్టడానికి సహాయపడుతుంది.
* **నిపుణుల సహాయం తీసుకోవడం:** అవసర మైతే, ఒక కౌన్సెలర్ లేదా థెరపిస్ట్‌తో మాట్లా డండి. కొన్నిసార్లు, మన పోరాటాలను అధిగ మించడానికి ఇతరుల సహాయం అవసరం. నిపుణులు మీకు సరైన గైడెన్స్ ఇవ్వగలరు.

## క్రీస్తే మన విజయం

ఈ లోకంలో మనం ఎదుర్కొనే ప్రతి సవాలును, ప్రతి బలహీనతను అధిగమించడానికి మనకు ఒకే ఒక ఆశ, ఒకే ఒక ఓదార్పు ఉన్నాయి. ఆయనే యేసుక్రీస్తు. పాపం అనే సంకెళ్ళను తెంచుకోవచ్చు, ప్రతి వ్యసనాన్ని జయించవచ్చు, ప్రతి భయాన్ని తొలగించుకోవచ్చు, కోల్పోయిన ప్రతిదాన్ని తిరిగి పొందవచ్చు. క్రీస్తు యేసు ఇప్పటికే విజయాన్ని సాధించాడు.

1 కొరింథీ 15:57 ఇలా చెబుతుంది, “అయినను మన ప్రభువైన యేసుక్రీస్తు మూలముగా మనకు జయము అనుగ్రహించుచున్న దేవునికి స్తోత్రము కలుగును గాక.” యేసుక్రీస్తు మన బలహీనతలను అర్థం చేసుకున్నాడు కాబట్టి మనకు ఈ విజయం లభించింది (హెబ్రీ 4:15). పాపంపై మనం విజయం సాధించడానికి ఆయన దేవుని సన్నిధిలో పట్టుదలతో ప్రార్థిస్తున్నాడు. “మృతులలోనుండి

లేచినవాడును దేవుని కుడి పార్శ్వమున ఉన్న వాడును మనకొరకు విజ్ఞాపనము కూడ చేయు వాడును ఆయనే" (రోమా 8:34(బి)). ప్రలోభాలను అధిగమించి క్రీస్తులో ఈ అపారమైన స్వాతంత్ర్యాన్ని ఆస్వాదించడానికి ఇదే మనకు ఉన్న ఏకైక నమ్మ కం. "కుమారుడు మిమ్మును స్వతంత్రులనుగా చేసినయెడల మీరు నిజముగా స్వతంత్రులై యుం దురు" (యోహాను 8:36). ప్రభువైన యేసు స్వయంగా మన చేయి పట్టుకొని మహిమగల విజయ మార్గంలో, నిత్య స్వాతంత్ర్యం వైపు మనలను నడిపిస్తాడు!!

**ముగింపు**

క్రీస్తులో స్వాతంత్ర్యం అనేది కేవలం ఒక ఆలో చన మాత్రమే కాదు అది జీవితాన్ని సమూలంగా మార్చే ఒక వాస్తవం. మన ఎంపికలు కొన్నిసార్లు పరిణామాలను తెస్తాయి, కొన్నిసార్లు బానిసత్వానికి కూడా దారితీయవచ్చు. అయితే శుభవార్త ఏమి టంటే, పాపపు పట్టుతో ఒంటరిగా పోరాడటానికి మనం విడిచిపెట్టబడలేదు.

ఆచరణాత్మకమైన అడుగులు వేస్తూ, చెక్కు చెదరని విశ్వాసంతో ముందుకు సాగితే, సిలువ వద్ద లభించిన విమోచన, స్వస్థతను మనం సొంతం చేసుకోవచ్చు. మన ప్రభువైన యేసుక్రీస్తు మన విజయాన్ని ఇప్పటికే సుస్థిరం చేశాడు. ఆయన మన ప్రతీ బలహీనతలన్నిటినీ అర్థం చేసుకుని, నిరంతరం మన పక్షంగా తండ్రి సన్నిధిలో విజ్ఞాపన చేస్తున్నాడు. క్రీస్తు మనకోసం సాధించిన ఈ అపారమైన స్వాతంత్ర్యం, మనల్ని శోధనలను జయించడానికి, ఆయన మహిమగల నిత్య విముక్తి మార్గంలో స్థిరంగా నడవడానికి శక్తినిస్తుంది.

**– ఇడిత్,** సీనియర్ అడ్వైజర్,
హెచ్‌సీయూ జోన్, సైబరాబాద్

* * * * * *

## అనుచరులా...?
## అభిమానులా...?

క్రీస్తుని బైబిల్లో కనుగొంటాం,
జీవితంలో మాత్రం చూపించం.

పెదాలతో ప్రార్థన చేస్తాం,
హృదయంలో భారం కలిగివుండం.

ఉపవాసాలుంటాం, ఉపన్యాసాలిస్తాం,
కష్టాల్లో ఉన్నవారిని మాత్రం పట్టించుకోము.

బయట దేవుని రాజ్యాన్ని ప్రకటిస్తాం,
ఇంట్లో లోకమర్యాదను అనుసరిస్తాం.

న్యాయాన్ని, కనికరాన్ని గాలికి వదిలేస్తాం,
ఎదుటివారిలో అవి లేవని తీర్పు తీరుస్తాం.



పబ్లిక్‌గా ప్రభువుని ఆరాధిస్తాం, సేవ చేస్తాం,
ప్రైవేటుగా పాత స్వాభావాన్ని కొనసాగిస్తాం.

ప్రభువు మహిమను దొంగలిస్తూ,
రెండవ రాకడ కోసం ఎదురుచూస్తున్న మేము,
క్రీస్తు అనుచరులం కాదు, అభిమానులం.

మాకోసం క్రీస్తు ప్రాణం పెట్టి తిరిగి లేచాడని విశ్వసిస్తాం,
సొంత చిత్తాన్ని నెరవేర్చుకోవడంలో
మనస్సాక్షికి వాత వేస్తాం.

**– చిన్నారి రంగారావు**
వర్డ్ అండ్ డీడ్ స్కూల్,
హయత్‌నగర్ జోన్



# గౌరవంతో పని చేయాలి

బైబిలు ప్రకారం, మానవులను దేవుడు తన స్వరూపంలో సృష్టించాడు. కాబట్టి, సృష్టికర్తయైన దేవుని లక్షణాలను మనం కొన్ని విధాలుగా ప్రతిబింబించాలి. దేవుడు స్వయంగా పని చేసినట్లు గానే, మనం కూడా పని చేయాలి. ఆది 1:27–28 వచనాలలో చెప్పబడినట్లుగా, మనం దేవుని స్వరూపంలో ఉండి, ఆయన ఆశీర్వాదంతో ఫలించి, అభివృద్ధి పొంది, భూమిని నింపాలి. భూమిని లోబరచు కోవాలి – ఇదంతా దేవునికి మహిమ తీసుకురావడానికే. ఆది 2:15లో, ఆదామును ఏదెను తోటలో "దాన్ని సేద్యపరచుటకును దాని కాచుటకును" ఉంచాడు. దీని బట్టి, పని అనేది మానవజాతి కోసం దేవుని ప్రణాళికలో ఒక అంతర్భాగం అని స్పష్టమవుతుంది. అంటే, పని అనేది పాపం వల్ల వచ్చిన శిక్ష కాదు, కానీ మానవుని ఉనికిలో పతనానికి ముందే ఉన్న ఒక సహజమైన భాగం.

పనిలో గౌరవం ఉంది. ఎందుకంటే, అది మనిషి కోసమే రూపొందించబడింది, మనం చేసే పనికి ఉన్న హోదాతో లేదా అందుకునే జీత ంతో సంబంధం లేకుండా ప్రతి పనికి గౌరవం ఉంటుంది. ప్రతి క్రైస్తవుడు తన పని ద్వారా దేవుని సృజనాత్మకతలో, ఆయన పరిరక్షణలో ఎలా పాలు పంచుకుంటున్నాడో స్పష్టంగా, సంతృప్తికరంగా గుర్తించగలగాలి. "లౌకిక" (సాధారణ) పనికి, "పవిత్రమైన" (ఆధ్యాత్మిక) పరిచర్య పని కంటే ఏ మాత్రం తక్కువ గౌరవం లేదా గొప్పదనం లేదు. మనం ఆత్మ, శరీరం రెండూ కలిగి ఉన్నవారం. బైబిలు చెప్పే ఆదర్శ జీవితం శారీరక శ్రేయస్సు (ఆరోగ్యం, మంచి జీవనం), ఆధ్యాత్మిక శ్రేయస్సు (దేవునితో సంబంధం) రెండింటినీ కలిగి ఉంటు ంది. మనం చేసే పనిని ఒక రకమైన పరిచర్యగా చూడాలి. ఇది దేవుని పట్ల మనకున్న ప్రేమను, ఆయన రాజ్యానికి మనకున్న నిబద్ధతను తెలియ

జేస్తుంది. మానవ ప్రయత్నం ద్వారా దేవుని మంచి తనాన్ని, శక్తిని ప్రదర్శించే మార్గం కాబట్టి, పని దేవునికి మహిమ తెచ్చే ఒక సాధనం అవుతుంది.

### ఇతరుల కొరకు పని చేయుట

బైబిల్ గ్రంథం, అన్ని రకాల పనులకు తగిన గౌరవం ఇవ్వాలని స్పష్టం చేస్తుంది. ఇందులో సరైన వేతనం, అనుకూలమైన పని వాతావరణం, అలాగే కార్మికుల హక్కుల సంరక్షణ వంటి విషయాలు ఇమిడి ఉన్నాయి. పని అనేది ఒక శిక్షగానో, లేక ఇతరులను దోచుకునే మార్గంగానో భావించకూడదు. బదులుగా, ఇతరులకు సేవ చేయడానికి, తద్వారా మరింత న్యాయమైన సమాజాన్ని నిర్మించడానికి అది ఒక గొప్ప మార్గంగా చూడాలి. మన చేతులతో మనం తయారుచేసే వస్తువులు ప్రజల జీవితాలను అభివృద్ధి చేయడంలో సహాయపడతాయి. ఇతరుల కోసం మనం పని చేస్తున్నప్పుడు, వారు మన ఉద్దేశ్యం గురించి ఆరా తీసి, ప్రశ్నలు అడగవచ్చు. ఆ సమయంలో, దేవుని ప్రేమను, ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా పొందే రక్షణానందాన్ని పంచుకోవడానికి మనకు అద్భుతమైన అవకాశం లభిస్తుంది.

మనం మన పనిలో శ్రద్ధగా ఉండాలని, సోమరితనాన్ని విడిచిపెట్టి, నిత్య జీవితంలో ఫలవంతంగా జీవించాలని దేవుడు మనలను పిలుస్తున్నాడు. మనం చేసే పనిని ఆనందించాలి, ఎందుకంటే మనం పరలోకమందున్న రాజులకు రాజుకు సేవ చేస్తున్నాం. కష్టపడి పనిచేయడం అనేది జీవితంలోని ప్రాథమిక సూత్రాలలో ఒకటి. ఇందులో మన సమయం, ఆలోచన, తెలివితేటలు, చిత్తశుద్ధి ఇమిడి ఉంటాయి. ఇచ్చిన మార్గదర్శకాలను మనం తప్పకుండా పాటించాలి, వాటి పరిమితులను కూడా గమనిస్తూ ఉండాలి. మనం అందరినీ సంతృప్తిపరచలేకపోవచ్చు. మన కార్యాలయంలో అప్పగించిన పనిని చేసేటప్పుడు, సృజనాత్మకతను, అలాగే గోప్యతను పాటించడం చాలా ముఖ్యం.

### పని ద్వారా వృద్ధి

ఈ లోకంలో ఎవరూ పరిపూర్ణులు కారు. మనం మన తప్పుల నుండి నేర్చుకోవాలి. ఏదైనా పొరపాటు జరిగినప్పుడు, వాటిని సరిదిద్దుకోవడానికి సానుకూలమైన దృక్పథాన్ని కలిగి ఉండాలి. మనం నిజాయితీగా ఉండాలి. మనకు ఇవ్వబడిన ఏ పని నుండి కూడా తప్పించుకోవడానికి ప్రయత్నించకూడదు.

బైబిలులోని తలాంతుల ఉపమానంలో మనం గమనించేదేమిటంటే, భయం లేదా నిష్క్రియాత్మకత వల్ల మనకు దేవుడిచ్చిన తలాంతులను, అవకాశాలను నిర్లక్ష్యం చేయకుండా, వాటిని అభివృద్ధికి, ఫలితాలను సాధించడానికి ఉపయోగించుకోవడం ఎంత ప్రాముఖ్యమో తెలుపుతుంది. అంతేకాకుండా, తమకు ఇవ్వబడిన వాటిని శ్రద్ధగా ఉపయోగించే వారికి దేవుడు ప్రతిఫలం ఇస్తాడని కూడా అది నొక్కి చెబుతుంది.

కాబట్టి, మనం పని చేస్తున్న కొలది, మరింత పని మనకు ఇవ్వబడుతుంది. ఇది భారంగా అనిపించినప్పటికీ, అది మనం చేసే మంచి పనికి లభించే ఫలం మరియు బహుమానం. ప్రభువు నుండి బలాన్ని పొంది, ఈ అదనపు పనిని కూడా సమర్థవంతంగా చేయాలి. తద్వారా మీ జీవితం, కార్యాలయంలోని మీ సాక్ష్యం ద్వారా దేవుడు మహిమపరచబడతాడు.

### మన పనితీరులో కొన్ని ఆచరణాత్మక చిట్కాలు:

మన జీవితాల్లో క్రీస్తును ప్రతిబింబించడానికి, అధికారంలో ఉన్నవారిని గౌరవించాలి మరియు మన సజీవ దేవునికి భయపడి జీవించాలి. మన పనిలో మన జీవనశైలి ద్వారా, చిన్న విషయాలలో కూడా మనం నిజాయితీగా ఉండాలి. అవి ఏవనగా:

* సమయం పట్ల స్పృహ కలిగి ఉండటం
* పరిశుభ్రత పాటించడం
* డ్రెస్ కోడ్ అనుసరించడం
* క్రమశిక్షణ కలిగి ఉండటం

* ఐడెంటిటీ కార్డ్, నోట్‌ప్యాడ్, పెన్ లేదా పెన్సిల్ వంటివి సక్రమంగా ఉంచుకోవడం.
* ఫార్మాట్‌లు, పట్టికలను సరిగ్గా ఉపయోగించడం
* నియమ నిబంధనలను పాటించడం
* హైరార్కీ, ప్రాధానత్యలను గుర్తించడం
* రిపోర్ట్స్, అకౌంట్స్ సిద్ధం చేయడంలో ఎటువంటి రాజీ పడకపోవడం
* విశ్లేషించడంలో, తీర్పు చెప్పడంలో పక్షపాతం లేకుండా ఉండటం

### పని ఎందుకు ప్రాముఖ్యమైనది?

డానియల్ డార్లింగ్ తన "ఫ్యాక్ట్స్ అండ్ ట్రెండ్స్" పత్రికలో స్పష్టంగా వివరించినట్లుగా, మన కార్యాలయాల్లో మనం చేసే పనికి ఉన్న గౌరవాన్ని విశ్వసిస్తూ, మన పని దేవునికి ఎందుకు ముఖ్యమో తెలియజేసే 5 కారణాలు ఇక్కడ ఉన్నాయి:

* పని మన మానవత్వంలో అంతర్భాగం.
* పని ద్వారానే మనం మన పొరుగువారిని ప్రేమించగలం.
* ఈ లోకంలో మనం చేసే పని, నిత్యత్వం కోసం ఒక శిక్షణా కాలం వంటిది.
* పని అనేది లోకంలో దేవుని పునరుద్ధరణ కార్యానికి కనిపించే రుజువు.
* పని శిష్యత్వంలో ఒక భాగం

ఈ ఐదు కారణాలు మన పనికి ఉన్న పవిత్రతను, ప్రాముఖ్యతను తెలియజేస్తాయి. మనం చేసే ప్రతి కార్యం దేవుని దృష్టిలో విలువైనదిగా గుర్తించాలి, ఆయన మహిమ కొరకే మనం పనిచేస్తున్నామని నిరంతరం గుర్తుంచుకోవాలి

### ముగింపు

పని అనేది దేవుని సృష్టిలో ఒక ముఖ్యమైన భాగం; అది మన జీవితంలో అంతర్గత గౌరవాన్ని మరియు ఉత్పాదకతను ప్రతిబింబిస్తుంది. ఇది మనకు దేవుని మహిమను చాటడానికి, ఇతరులకు ప్రేమతో సేవ చేయడానికి మరియు నిత్యమైన జీవితానికి సిద్ధం కావడానికి ఒక ఉన్నతమైన మార్గం. మన దైనందిన శ్రమ ద్వారా, మనం దేవుని అపారమైన ప్రేమను మరియు ఆయన రాజ్యానికి మనకున్న నిబద్ధతను స్పష్టంగా చూపించగలుగుతాము. కాబట్టి, మన ప్రతి పని ద్వారా దేవుని మహిమను లోకానికి చాటుదాం!

**– వెంకట్ జూపూడి,** విజయవాడ.

వీరు న్యూఢిల్లీలోని రక్షణ మంత్రిత్వ శాఖ, ఆర్మీ హెడ్ క్వార్టర్స్‌లో సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్‌గా పదవీ విరమణ చేశారు.

* * * * * *

## కాగడా వెలుగు



ఓ విజ్ఞాన యవ్వన యువతార
పరుగెడదాం సత్యాన్ని ప్రకటింప
అడుగేద్దాం ఆయన అడుగులలో
కదిలిద్దాం కళాశాలలను క్రీస్తు బలంతో

నిరాశ చెందకు యేసు నీకుండగా
కలత చెందకు క్రీస్తు నిన్ను కదిలించగా
ఎవరు లేరు నీ తీరు వెయ్యాలి నీవే ముందడుగు
వెలగాలి నీవే రవి తీరు చెయ్యాలి నీవే కవాతు

ప్రయాసపడు పౌలులా ప్రభుపనికై
బాణమై కదులు కార్యసిద్ధుండవై
అడుగుపెట్టి అడుగు విధేయుడవై
కాదనడు క్రీస్తు నీ మధనాన్ని

భారంతో సిద్ధపడు విద్యార్థుల మార్పుకై
మండుతూ వెలగాలి కాగడా జ్వాలవై
కోతెంతో విస్తారం పని వారు బహు కొంచెం
ఏ రోజుకో కాదు ఈ రణం ప్రభుపనికై
పరుగెడదం ఈ క్షణం.

**– డి. కొండల్, హయత్‌నగర్**



ప్రత్యేకం

# మనుష్యుల సాయం వ్యర్థము రా

"మనుష్యుల సాయం వ్యర్థము రా..

రాజుల నమ్ముట వ్యర్థమురా...

యెహోవాను ఆశ్రయించుట

ఎంత మేలు.. ఎంతో మేలు.." అంటూ ఎజ్రాశాస్త్రి గళం నుండి జాలువారిన

ఎవరికి ఎవరు ఈ లోకంలో

చివరికి యేసే పరలోకంలో

అనే పాట చర్చి గుడి మీద మోగుతున్నది.

సాయమ్మ నస్కుల లేసి, వాకిలి ఊడ్చి, సామిడి సల్లి తొందరగా గుడికి పోవాలని రప్ప, రప్పా పని చేస్తున్నది. తనతో పాటు కొడుకులను, కోడలు, బిడ్డను తయారు చేస్తుంది. ఇంతలోనే పెనిమిటి అడ్డుపడి గుడికి పోయినంతమాత్రాన కష్టాలు పోతాయా? ప్రార్థన చేస్తే పైసలు వస్తాయా? చర్చికి లేదు ఏమి లేదు. అందరూ కలిసి పని చేయండి అని ఈసడించుకున్నాడు.

మొగుణ్ణి ఎదిరించలేక ఎగబాకిన ఏడుపుతో ఏవూరు మంటుంది. సాయమ్మ పుట్టిల్లు అన్యుల సోపతి అయినా కిరస్తానం పెళ్లి కావడంతో ఆ మతంలో మునిగింది, దేవుడంటే ఇష్టం. చర్చి అంటే ప్రాణం. ప్రార్థన కోసం పరుగు. ఎంత విశ్వాసమో వట్టిమాలిన మట్టి మనిషికి. ఇక్కడ ఒక ముచ్చట చెప్పాలె, తన చిన్న కొడుకు పౌలును బడిలో చేరికకు పోయినప్పుడు, బడి పంతులమ్మ మీదే కులపోళ్ళని అడిగితే, మేము

కిరస్తానపోళ్ళం అనేంతగా. అందుకు టీచరమ్మ, గిట్ల పేరు రాయిస్తే సర్కారు నుండి ఏమిరావనీ ఘీంకరిస్తే, ఏమి రాకపోయిన పర్వలేదు గట్లనే రాయండని ఎదురాడిన ముచ్చట. ఎంత గొప్ప నిరీక్షణో....

******

సాయమ్మను చర్చికి రానీయకుండా పెనిమిటి అడ్డుకుంటున్నాడని తెలిసి ఆనాటి సంఘ పెద్ద, సుట్టమైన జీవరత్నంకు తెలిసి గట్టిగానే అరుసుకున్నాడు. అట్లా కాదన్నా గిట్ల చేస్తే ఎట్లా సంతోషను (పెండ్లిలో సాయమ్మ పేరు సంతోషగా మార్చారు) చర్చికి రాణిస్త లేవంట? ఇట్లా చేస్తే పిల్లలకు భయం ఎట్లా వస్తది. భక్తి ఎట్ల పారుతది. నీవు రాకపోతే అందరిని రానీయవా గట్ల అయితే ఎట్లా అని గట్టిగానే మందలించడంతో ఆపూటకి సల్లబడ్డ, మనిషి మాత్రం మారలే. చర్చికి టైం అయిందని ఎలాగోలాగా చిన్న కొడుకును తీసుకొని పోయింది సాయమ్మ కాదు సంతోషమ్మ.

******

పాదిరి ప్రార్థనతో పాటలు జోరందుకున్నాయి ఆనాటి పోరలు, పడుసు పిల్లలైనా ప్రేమయ, సంసోను పేతురు, జయన్న, దేవదాసు, పరంజ్యోతి, సువార్త కీర్తనల పుస్తకము నుండి పాటలు పాడుతున్నారు. సంఘ పెద్ద ఆరోను కంజీర కొడుతుంటే మరో సంఘ పెద్ద జీవరత్నం గిలక తప్పెట లయబద్ధంగా దరువు అందుకున్నాడు. పాదరి పంతులు హార్మోనియం వాయిస్తున్నాడు పంతులు పేరు దావీదు సారు. వయసులో పెద్దోడైన బోధనలో దిట్ట.

******

పాస్టర్ సారు గంభీర స్వరంతో ఈరోజు అంశం "నిరీక్షణ" అని అన్నాడు. చదువు రానోళ్లకు, అంతంత మాత్రం చదివినోలకు ఆ మాటే అర్థం కాలె. అదేనమ్మా మన దిక్కు దేవుడే... ఇంకెవరూ లేరు కష్టమైనా, నష్టమైన ఆయన నమ్ముకుని ఉండాల్సిందే సుఖమైన, దు:ఖమైన మరో గతి లేదని హుంకరించాడు. అప్పుడు గాని అర్థం కాలేదు ఆ మట్టిబుర్రలకు.

******

నా నిరీక్షణకు ఆధారమగు దేవా అనే వాక్యంతో పాస్టర్ గారు బోధ స్టార్ట్ (సురువు) చేసాడు. అబ్రహాము శారా గురించి చెబుతూ, ఇక వారి జీవితంలో పిల్లలు పుట్టరు అనే నమ్మకానికి వచ్చింద్రు. ఎంతంటే దేవదూత శారాకు సంతానం కలుగుతుందని మాట ఇస్తే ముసిముసిగా నవ్వేంతగా, ఈ ముచ్చటను విశ్వాసులకు అన్వయిస్తూ దేవుని కోసం పని చేస్తే మిత్తితో సహా చెల్లిస్తాడని అర్థం అని అన్నాడు. కానీ అబ్రహాము తన అన్న కొడుకు లోతును బాగా నమ్మాడు. కొంతమందినైనా ఆయనలాగా మార్చుంటాడని, కానీ అంతా ఉల్టా జరిగింది. కడకు లోతు భార్య కూడ లోక ఆశలకు వెళ్లేంతగా. ఆ ఇల్లు ఈడువబడింది. కాబట్టి విశ్వాసులారా మనుష్యులను నమ్ముకోకండి దేవుడిని నమ్మండి అని గట్టిగానే అరుసుకున్నాడు.

******

దావీదును దేవుడు బాగా నమ్మాడు మనసుకు నచ్చేంతగా కానీ ఆయన చేసినదేమిటి పరాయి స్త్రీతో వ్యామోహం, పాపం చేయడం పైగా ఆమె పెనిమిటిని చంపించడం, మీలో ఎంతమందికి ఇటువంటి జాఢ్యాలు ఉన్నాయి? ఉంటే ఇప్పుడే విడిచిపెట్టండి లేకపోతే దేవునికి కోపం వస్తది అన్నారు. నమ్మిన దావీదు మోసం చేసినందుకు దేవునికి కోపం వచ్చి బతికినన్ని దినాలు కష్టాలే పెట్టిండు. ఎక్కడ నెమ్మది లేదు, సుఖం లేదు. రాజ్యం ఉంది సేవకులు, సైన్యం ఉంది. ఎంత ఉంటే ఏం సుఖం, నెమ్మదిలేని జీవితం. ఒకవేళ మీరు గిట్ల ఇట్లా ఉంటే ఇప్పుడే మీ పాపం ఒప్పుకోండ్రి దేవుడు

క్షమిస్తాడు కానీ శిక్ష మాత్రం తప్పదు. దేవుని నమ్మాలి గాని మోసం చేయకూడదు.

******

దయచేసి వినండి ప్రియులారా పరిశుద్ధ గ్రంథంలో ఇంకొక ఆయన ఉన్నాడు. ఆయన పేరు సంసోను. ఈ పేరు చాలా మందికి ఉంటది నా పేరు లాగా. సంసోనుకు దేవుడు మస్తు బలం ఇచ్చిండు, ఆయన బలమంతా నెత్తి వెంట్రుకలలో ఉంది. ఎందుకంటే ఆయనకు పుట్టేంటికలు తీయలేదు. కానీ ఆయన కూడా స్త్రీ లోలుడు. ఇట్లుంరు జనాలు, ఆయనను ప్రేమించినామె నమ్మించి, నిద్ర పోయినప్పుడు వాళ్ళ దేశ పోలతోటి వెంట్రుకలు తీపించింది. దానితో ఆయనకు బల మంతా పోయింది. చివరికి శత్రువుల చేతికి చిక్కి నానా దెబ్బలు తిన్నాడు. లాస్టుకు (ఆఖరికి) సంప నింకే తీసుకుపోయి, రెండు స్తంభాలకు కట్టేసింద్రు. అప్పుడుగాని ఆయనకు గుర్తుకు రాలేదు దేవుడు.

అయ్యలారా అమ్మలారా బాగా గుర్తుంచుకోండి. మనుష్యులను నమ్మకండి మోసం చేసేటోళ్లు. దేవుని నమ్మండి. ఎందుకంటే దేవుడు కాపాడతాడు. అప్పుడు సంసోను దేవా నేను తప్పు చేశాను అని పశ్చాతాపంతో, నాకు ఒకసారి తిరిగి బలం ఇయ్యి అని ప్రార్థించగా దేవుడు ఆయన పాపాన్ని క్షమించి బలమిచ్చిండు కానీ ఆ సంఘటనలో సంసోను ప్రాణం కూడా పోయింది. దేవుడు సంసోను పాపాన్ని క్షమించిండు, కానీ పాపానికి శిక్ష ఆయన మరణం. కాబట్టి మనుషులను నమ్మకండి దేవుని నమ్మండి ఆయన యందు నిరీక్షణయించండి. మంచి జరుగుతుంది అని మందలించాడు.

******

పాస్టర్ గారు కోటును సవరించుకుంటూ, ఏ చర్చిలోనైనా ఆడోళ్ళు ఎక్కువగా వస్తారు. మన చర్చిలో కూడా అంతే. అమ్మలారా వినండి, పురుషులారా జాగ్రత్తగా ఆలకించండి పరిశుద్ధ బైబిల్ గ్రంథంలో ఎస్తేరు అని ఒక రాణి ఉంది. అయితే రాజు, ఆ దేశ ప్రధానమంత్రి మాటలు నమ్మి, రాణి గారి సుట్టపోళ్లనందరిని, జాతోల నందరిని చంపనింకే ఫత్వా జారీ చేసిండు. ఈ సంగతి ఆమె బంధువైన మొర్దికై, రాణి గారి చెవిలా వేసిండు. రాజుగారేమో మన జాతిని ఖతం చేయడానికి డిక్రీ పాస్ చేసిండు, నీవు ఇక్కడ బాగానే ఉన్నావు కానీ నీవు కూడా మా జాతే అనే సంగతి మర్చిపోవద్దు. కాబట్టి రాజుతో మాట్లాడి పరిష్కారం చేయి. లేకపోయినా పర్వాలేదు దేవుడు కాపాడుతాడు అని చెప్పి పోయిండు.

ఒకరోజు రాణి, మొర్దికైని పిలిపించి నేను నా చెలికత్తెల తోటి మూడు రోజులు ఉపవాసం ఉండి ప్రార్థన చేస్తాను, మీరు కూడా ప్రార్థన చేయండి అని చెప్పి పంపింది. ఇటువైపు ఈమె, అటువైపు వాళ్ళు ఉపవాసం ఉండి ప్రార్థన చేయగా దేవుడు సమస్యను పరిష్కరించిండు. చూశారా ప్రార్థన, నిరీక్షణ వీరిని చావు నుండి తప్పించింది. సమ స్యకు పరిష్కారం చావు కాదు, దేవుని యందు నిరీక్షణ ఉంచడం.

******

ఏయ్ పిల్లలు సప్పుడు చేయకండి ఇక నేను ముగిస్తున్న, అపొస్తుడైన పౌలు మహా జ్ఞాని. ఆయనకు ఆస్తి ఉంది, అంతస్తుంది, గుణం ఉంది, అన్ని ఉన్నాయి కానీ అవన్నీ పక్కకు పెట్టి దేవుని కోసం బతకాలని ఎంత కష్టపడిండు. చివరికి మరణించిండు. ఆయన నిరీక్షణ మాత్రం జీవ కిరీటమే.

******

ఈ వ్యాసం కథానిక రూపంలో ఉన్న నిరీక్షణ. ఈ కథనం తెలంగాణ మాండలికంలో రాయడానికి స్ఫూర్తి పాకాల యశోద రెడ్డి రచనలు.

**– పి. విజయ్ కుమార్**

హయత్ నగర్ జోన్, హైదరాబాద్



# అబీగయీలు

## (ముత్యము కంటె అమూల్యమైన భార్య)

నేటి దినాల్లో సమాజంలో భార్యాభర్తలు చిన్న చిన్న విషయాలకే గొడవలుపడి, సమాధానముతో జీవించలేక విడాకులు తీసుకుంటున్నారు. ఒంటరిగా ఉంటూ జీవితాన్ని కొనసాగిస్తున్నారు. భర్త కంటే కొంచెం ఎక్కువ తెలివితేటలు, ప్రభుత్వ ఉద్యోగం, నైపుణ్యాలు కలిగిన స్త్రీలు భర్తల్ని గౌరవించడానికి ఇష్టపడరు. తక్కువ చేసి మాట్లాడతారు. ఇలాంటి పరిస్థితుల్లో అబీగయీలు జీవితం ఒక గొప్ప ఆదర్శం.

### విరుద్ధ స్వభావాలు కలిగిన దంపతులు

బైబిల్లోని 1 సమూయేలు 25వ అధ్యాయాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసినట్లయితే, పరస్పర విరుద్ధ స్వభావాలు కలిగి ఉన్న నాబాలు – అబీగయీలు భార్యాభర్తలను మనం చూడవచ్చు. అబీగయీలు తన భర్త నాబాలు దుర్మార్గుడైనప్పటికీ, భర్తను ప్రేమించి, గౌరవించి, లోబడింది. అబీగయీలు తన అందమైన వ్యక్తిత్వ గుణాలతో, తన భర్త మీదికి, తన కుటుంబం మీదికి గొప్ప ఆపద, ప్రమాదం వచ్చినప్పుడు తన భర్తను కాపాడి, తన కుటుంబాన్ని కట్టుకునే ప్రయత్నం చేసింది.

కర్మెలులో మాయోను నందు కాలేబు సంతతి వాడైన, ఆస్తిగల నాబాలు అనే వ్యక్తికి సుబుద్ధి గలిగి రూపసియైన అబీగయీలు అను భార్య ఉండెను. అయితే, నాబాలు మోటువాడు, దుర్మార్గుడునై యుండెను.

### అబీగయీలు చురుకైన స్పందన

నాబాలు కర్మెలులో గొఱ్ఱెల బొచ్చు కత్తిరించు చున్నాడని అరణ్యములో ఉన్న దావీదు విని, తాను చేసిన ఉపకారమునకు ప్రతిగా అన్నపానములను,



**ఆమె చూపిన బుద్ధి విషయమై ఆమెను ఆశీర్వదించి, ఆమె తెచ్చిన వాటిని తీసుకుని, ఆమె మనవిని అంగీకరించి సమాధానముతో ఆమెను పంపి వేస్తాడు.**

వధించిన పశుమాంసమును నీ దాసులకును నీ కుమారుడైన దావీదునకు ఇమ్మని అడుగుటకు తన పనివారిలో 10 మందిని నాబాలు నొద్దకు పంపించాడు. అయితే, నాబాలు వారితో దురుసుగా మాట్లాడి వారిని పంపివేస్తాడు. అప్పుడు దావీదు పనివారు వెనక్కి తిరిగి దావీదు దగ్గరకు వెళ్లి నాబాలు ఏవిధంగా దురుసుగా ప్రవర్తించాడో అన్ని మాటలను అతనికి తెలియజేస్తారు.

అప్పుడు దావీదు రౌద్రుడై, తెల్లవారేసరికి నాబాలు కుటుంబంలో ఒక మగపిల్లవాడినైనా ఉండనివ్వనని నాబాలు మీదికి యుద్ధానికి బయలు దేరుతాడు. అప్పుడు ఒక పనివాడు నాబాలు భార్య అయిన అబీగయీలు దగ్గరకు వచ్చి, తన భర్త ఏవిధంగా దావీదు పంపిన పనివారితో కఠినముగా మాట్లాడాడో వివరించి చెప్పి, దావీదుతో పాటు 400 మంది కత్తులు ధరించి, ఉపకారానికి అపకారం చేసిన నాబాలు ఇంటివారిలో ఒక మగపిల్లవాడినైనా తెల్లవారేసరికి ఉండనివ్వనని కోపంతో బయలు దేరెనని, ఇప్పుడు నీవు చేయవలసిన దానిని చాలా జాగ్రత్తగా ఆలోచించుమని చెప్తాడు.

అప్పుడు అబీగయీలు నాబాలుతో ఏమియు చెప్పకుండా త్వరగా 200 రొట్టెలు, రెండు ద్రాక్షారసపు తిత్తులు, వండిన 5 గొఱ్ఱెల మాంసము, 5 మానికల వేయించిన ధాన్యము, 100 ద్రాక్ష గెలలు, 200 అంజూరపు అడలను గార్దభముల మీద వేసి, తనకంటె ముందుగా వెళ్లమని తన పనివారికి ఆజ్ఞాపించింది. వారి వెనుక అబీగయీలు కూడా బయలుదేరి దావీదును, అతని జనులను కలుసు కున్నప్పుడు, దావీదుకు సాష్టాంగ నమస్కారం చేసి అతని పాదములు పట్టుకుని, నా భర్త చేసిన తప్పు నాదని యెంచి, నాబాలును లక్ష్యపెట్టకుండా, నా ఏలినవాడవగు నీ దగ్గరకు తెచ్చిన ఈ కానుకను అంగీకరించి, నీ దాసురాలనైన నా తప్పును క్షమి ంచి, యెహోవా నా ఏలిన వాడవగు నీకు మేలు చేసిన తరువాత నీ దాసురాలనైన నన్ను జ్ఞాపకం చేసుకోమని బ్రతిమాలింది.

అప్పుడు దావీదు ఆమె చూపిన బుద్ధి విషయమై ఆమెను ఆశీర్వదించి, ఆమె తెచ్చిన వాటిని తీసు కుని, ఆమె మనవిని అంగీకరించి సమాధానముతో ఆమెను పంపివేస్తాడు.

### నాబాలు అంతం

అబీగయీలు తిరిగి నాబాలు దగ్గరకు వచ్చినప్పుడు అతడు మత్తుడైయుండుట చూసి తెల్లవారే వరకు అతనితో ఏమీ చెప్పకుండా ఊరకుంది. ఉదయం నాబాలుకు మత్తు తగ్గినప్పుడు ఆమె అతనితో జరిగిన సంగతులన్నింటిని తెలియజేయగా, భయంతో అతని గుండె పగిలి రాయి వలె బిగుసుకుపోయాడు. పది దినములైన తరువాత యెహోవా నాబాలును మొత్తగా అతడు చనిపోయెను.

### నాబాలు – దురుసుతనం లక్షణాలు

* ఉపకారానికి అపకారం చేయడం
* ఇతరులను అగౌరవపరచడం
* దయ, కనికరం లేకపోవడం
* సాత్వికముతో సమాధానం చెప్పలేకపోవడం

* ఎవరి మాటా వినకపోవడం (వినడానికి, నేర్చుకోవడానికి ఇష్టపడకపోవడం)
* మోటుతనం, దుర్మార్గత – దుష్టత్వం కలగలిపి ప్రవర్తించడం
* అవసరంలో ఇంటికి వచ్చినవారిని ఒట్టి చేతులతో పంపించడం

ఈ గుణలక్షణాలన్నిటినీ కలిపి 'దురుసుతనం' గా వర్ణిస్తారు. నాబాలు ఈ గుణలక్షణాలన్నీ కలిగిన ఒక గొప్ప ఆస్తిపరుడైన భర్త.

**అబీగయీలు – దృఢమైన వ్యక్తిత్వ లక్షణాలు**

* తెలివి, వివేచన కలిగి శ్రద్ధగా ఆలోచించడం
* ఎదుటివారిని గౌరవించడం
* కఠిన పరిస్థితులలో త్వరగా స్పందించే చురుకైన స్వభావం
* భావోద్వేగాలను నియంత్రించుకునే సామర్థ్యం
* తగ్గించుకోవడం, వినయం, విధేయత, దీనత్వం కలిగి ఉండటం
* అనవసరమైనవాటికి వద్దు/కాదు అని ధైర్యంగా చెప్పగలగడం
* కంగారు పడకుండా చక్కటి ధైర్యసాహసాలు కలిగి స్పందించడం
* ఉపకారాలు చేయడం

ఈ దైవికమైన వ్యక్తిత్వ గుణలక్షణాలన్నిటినీ కలిపి 'దృఢమైన వ్యక్తిత్వం' గా వర్ణిస్తారు. అబీగయీలు ఈ గుణలక్షణాలన్నీ కలిగిన మంచి బుద్ధిగల భార్య.

**దృఢమైన వ్యక్తిత్వం – కుటుంబానికి పరిష్కారం**

* దృఢమైన వ్యక్తిత్వం దాచబడిన ధననిధి వంటిది
* మనలో ఎవరూ కూడా దురుసుతనం/దృఢమైన వ్యక్తిత్వంతో పుట్టరు. కానీ, మన చుట్టూ ఉన్న పరిస్థితులు, వ్యక్తులు, వ్యక్తిగత అభ్యాసం మన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది
* పాపాన్ని ఎదిరించే విషయంలో, దేవుని కోసం నిలబడే విషయాల్లో దృఢమైన వ్యక్తిత్వం కలిగియుండాలి. దానివల్ల దేవుని నామం మహిమపరచబడుతుంది
* మంచి వ్యక్తిత్వ గుణలక్షణాలు ఒక్కసారిగా ఒక రోజులో రావు. కానీ, దేవుని సహాయంతో అభ్యాసం చేస్తూ, నేర్చుకుంటూ ఎదగాలి
* భార్యలు దృఢమైన వ్యక్తిత్వం కలిగినవారైతే, కుటుంబంలో వచ్చే అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది
* ప్రతి భార్య దేవుడిచ్చే జ్ఞానం, వివేచన సహాయంతో ఎప్పుడు, ఎక్కడ, ఎలా, ఎవరితో "దృఢమైన వ్యక్తిత్వం" కలిగి ప్రవర్తించాలో దేవుని అడగాలి
* ఆరోగ్యకరమైన సంబంధాలు కలిగి ఉండాలనుకునే ఏ భార్య అయినా దృఢమైన వ్యక్తిత్వం కలిగి హుందాగా ప్రవర్తించాలి
* దృఢమైన వ్యక్తిత్వంతో ఎదగడం వల్ల సంఘర్షణ, ఒత్తిడి, విరుద్ధ స్వభావం కలిగిన విషయాల నుండి విడుదల పొందుతాం
* విశ్వాసంలో ధైర్యంగా ఎదుగుతాం
* ఆరోగ్యకరమైన ఆత్మగౌరవం, భావోద్వేగ విషయాలలో ఎదుగుతాం

**ముగింపు**

సామెతలు 31:10లో చెప్పినట్లుగా, "గుణవతియైన భార్య దొరుకుట అరుదు అట్టిది ముత్యము కంటే అమూల్యమైనది." అరబిక్ భాషలో 'లులు' అంటే 'ముత్యము' అని అర్థం. అబీగయీలు చక్కని గుణవతియైన భార్యగా దృఢమైన వ్యక్తిత్వాన్ని ప్రదర్శించింది. తన కుటుంబంలో అబీగయీలును ముత్యము వంటి అమూల్యమైన భార్యగా వర్ణించవచ్చు. అబీగ యీలు జీవితం నేటితరం భార్యలందరికీ ఎంతో ఆదర్శనీయం.

– **త్రివేణి శ్రీను**, రామాంతపూర్ జోన్, హైదరాబాద్

ప్రత్యేకం



# పరివర్తన సాధ్యమే

నేనొక అన్యాయస్థున్ని, అక్రమంగా ప్రజల దగ్గర నుండి ఎక్కువగా టాక్స్ వసూలు చేస్తుండే వాడిని. నా గురించిన ఈ సత్యం అందరికీ, నాకు కూడా తెలుసు. కానీ ఒక రోజు నా లైఫ్‌లో ఒక తెలియని మార్పు వచ్చింది. అది నా లైఫ్‌కి ఒక టర్నింగ్ పాయింట్ అయ్యి నా సమస్త జీవిత గమనాన్నే మార్చి వేసింది. ఇంతకీ నా పేరు చెప్పలేదు కదూ! నా పేరు జక్కయ్య. నేను ఒక ధనవంతుణ్ణి. నా జాబ్ టాక్స్ కలెక్టర్. మా ఊరు యెరికో పట్టణము.

ఒకరోజు మా ఊర్లోకి ఒక ప్రముఖమైన వ్యక్తి వస్తున్నాడని విన్నాను. సాధారణంగా ఇలాంటి వ్యక్తులు వస్తే ప్రజలు గుంపులు గుంపులుగా చేరతారు. అది విన్న నేను, ఆ ప్రముఖ వ్యక్తిని చూడాలని ఆశ కలిగి, చూద్దామని అనుకున్నాను. కానీ చూడ్డానికి వీలుగా లేదు. ఎందుకంటే చాలా మంది ప్రజలు గుంపులు గుంపులుగా ఉన్నారు. ఆయన ఏమైనా రాజకీయ నాయకుడా? అన్నంత జన సందోహం అది. అయితే నేను మీకు మరొక విషయం చెప్పాలి. అదేంటంటే నేను చాలా పొట్టిగా ఉంటాను. కాబట్టి గుంపులు గుంపులుగా ఉన్న ప్రజలలో నుండి ఆ ప్రముఖ వ్యక్తిని చూడ డానికి వీలుపడలేదు. అప్పుడు నాకు ఒక వినూత్న మైన ఆలోచన వచ్చింది. ఆ ప్రముఖ వ్యక్తిని ఎలాగైనా చూడాలనే అచంచలమైన ఆశతో అతడు వస్తున్నాడని తెలియగానే, అందరి కంటే ముందుగా ఆ దగ్గరిలో ఉన్న ఒక మేడి చెట్టుని చూసి, ఆ చెట్టు ఎక్కాను.

ఇంతలో ఆ వ్యక్తి ఆ దారి గుండా రానే వచ్చాడు. నా ఆశ్చర్యానికి హద్దులు లేవు! నేనున్న చెట్టు దగ్గరే ఆగాడు. నా పేరు పెట్టి నన్ను పిలిచాడు. నేను షాక్ అయ్యాను... అసలు అతనికి నా పేరు ఎలా తెలుసు అని ఆశ్చర్యపోయాను. నేను తేరుకునే లోపే, "జక్కయ్య త్వరగా దిగి రా! నేను నీ ఇంట్లో ఉండాలనుకుంటు న్నాను" అన్నాడు. ఆయన పిలుపులో ఉన్న స్వచ్ఛమైన ప్రేమకు నేను

ముగ్ధుడనైపోయాను. వెంటనే సంతోషం తో నేను ఆయనను మా ఇంటికి ఆహ్వానించాను.

కానీ ఈ సంఘటన అక్కడి ప్రజలకు ఆశ్చర్యంతో పాటు ఆగ్రహాన్ని కూడా కలిగించింది. ఇది చూసి అక్కడున్న ప్రజలు నా గురించి సణుగుకోసాగారు. నన్ను గురించి వారు మాట్లాడిన మాటలు, పాపినని, అన్యాయస్థుడినని, ఇలాంటి వ్యక్తి ఇంటికి ఈ ప్రముఖ వ్యక్తి వెళ్తున్నాడని ప్రజలందరు చెవులు కొరుకున్నారు. ఆ క్షణంలో నా అంతరంగంలో కలిగిన లోతైన ఆలోచన ఏమిటంటే: "విలువ పెంచే ధనం నాతో ఎంత ఉండి ఏం లాభం, నాకు విలువనిచ్చే జనం నా చుట్టూ లేనపుడు...! ధనం ముందు గుడ్డిదై పోయింది నా గుణం. ఈ మాటలు నా హృదయాన్ని కలచివేశాయి.

ఆ ప్రముఖ వ్యక్తి మా ఇంట్లోకి అడుగుపెట్టాడు. ఆయన రావడంతో, ఆయన పలకరింపు, ఆయన మాటలు వినడంతో అసలు నేనెవరో అనే విషయం నాకర్థమయింది. నేనెంత ఘోరమైన జీవితం జీవిస్తున్నానో నా కర్థమయింది. ఆ క్షణంలో అనిపించింది: ఛీ... ఛీ... నాది ఒక బ్రతుకేనా? నేను ఒక ధనవంతుణ్ణి, ఉద్యోగుస్తుణ్ణి, సమాజంలో నా కంటూ ఒక హోదా ఉన్న వ్యక్తిని. కానీ డబ్బుకి కక్కుర్తి (ఆశ) పడి ప్రజల వద్ద పన్నును ఎక్కువగా తీసుకున్నాను. అత్యాశతో అలా పన్ను తీసుకోవడంతో ప్రజల దృష్టిలో విలువ తక్కువ వానిగా మిగిలి పోయాను. డబ్బు మీద ఉన్న అత్యాశ నన్ను సమాజంలో ఎక్కడికి లాక్కొని పోయిందో చూస్తే నా మీద నాకే అసహ్యం వేస్తుంది. అత్యాశ నాకు అందరిలో అవమానాన్ని, చెడ్డ పేరుని తీసుకొచ్చింది.

నిజమే కదా! విలువ పెంచే ధనం నాతో ఎంత ఉండి ఏం లాభం, నాకు విలువనిచ్చే జనం నాచుట్టూ లేనప్పుడు. ధనం ముందు గుడ్డిదై పోయింది నాగుణం. ఈ సత్యం నాకు స్పష్టంగా అప్పుడు కనిపించింది. డబ్బు మనిషినైన నన్ను మార్చలేదు కానీ నా నిజ స్వరూపాన్ని బయటపెట్టింది. ఈలాంటి నా పరిస్థితిని చూసి జనం నన్ను ఎంతగానో చెడ్డవానిగా గుర్తించారు. కానీ ఆ విషయమే నాకర్థం కాలేదు – నేను నా కళ్ళముందే ఉన్న సత్యాన్ని చూడలేకపోయాను. అంటే డబ్బుకోసం నా వ్యక్తిత్వాన్ని అమ్ముకున్నాను ఇన్ని రోజులు. నేను గుడ్డిగా చీకటిలోనే పాపపు ఊబిలో పడిపోయాననే ప్రమాదకరమైన విషయం ఆ ప్రముఖ వ్యక్తి రావడంతో, అతని స్వచ్ఛమైన సాన్నిహిత్యంలో నాకర్థమయింది.

ఆ క్షణమే నా జీవితంలో ఒక గొప్ప నిశ్చయం చేసుకున్నాను. కాబట్టి నా గురించి ఎవరు ఏ మనుకుంటున్నారో అనేది నేను ఆలోచించలేదు. కానీ నా రోత జీవితం, పాత జీవితం ఇంకా కొన సాగించాలని ఒక్క క్షణం కూడా అనుకోలేదు. ఆ క్షణం మార్పుకు శ్రీకారం చుట్టాను. వెంటనే లేచి, నా ఆస్తిలో సగం బీదలకిస్తానని, అన్యాయంగా తీసుకున్న వారికి నాలుగు రెట్లు తిరిగి ఇచ్చేస్తానని బహిరంగంగా మాటిచ్చాను.

ఇంతకీ ఆ ప్రముఖ వ్యక్తి ఎవరో మీకు చెప్పలేదు కదూ...? నిజానికి ఆయనే నా జీవితాన్ని ప్రతీ కోణంలోనూ మార్చివేశాడు. ప్రజలందరూ నన్ను చూసి ఛీ... అని అన్నా, ఆయన మాత్రం నన్ను ఛీ అనలేదు. ఆయన ప్రేమకు హద్దులు లేవు. నా దగ్గరకు వచ్చి, నా స్థితి చూసి, నాతో మాట్లాడి నాతో ఉంటానని చెప్పిన నిజమైన ప్రేమమూర్తి...

ఆ పవిత్రమైన వ్యక్తి మరెవరో కాదు, సకల మానవాళికీ మార్గాన్ని చూపే... నేనెంత ఘోరమైన పాపినను నన్ను నన్నుగా చూసి, నా తప్పుల న్నింటిని క్షమించిన గొప్ప విమోచకుడు... నశించి నరకానికి వెళ్ళవలసిన నా బ్రతుకును నా కుటుంబాన్ని రక్షించిన రక్షకుడు... వెదకని నాకు దొరకిన ప్రభువు... ఆయనే 'యేసుప్రభువు'

**– ప్రేమ సదానందం,**
మంచిర్యాల



కథానిక

# నాలోని నేను

ఆ రోజు ఆదివారం. అందరం సంఘానికి వెళ్ళాం. కొద్ది రోజులుగా నా మనసేం బాగాలేదు. చర్చిలో పాటలు పాడాను, వాక్యం చదివాను, ప్రార్థన కూడా చేశాను. అన్నీ బాగానే చేశాను అనుకున్నా, కానీ నా లోపల ఏదో వెలితి. అది ఏమిటో నాకు అర్థం కావడం లేదు. అప్పుడే స్నేహితుల నుండి వాట్సాప్‌లో కొత్త సినిమా లింక్ వచ్చింది. నేను ఇంతే... చర్చికి వెళ్తాను, బైబిల్ స్టడీకి వెళ్తాను, అన్నీ చేస్తాను. కానీ నా వ్యక్తిగత జీవితం ఎవరికీ తెలియదు. ఆఖరికి మా ఇంట్లో వాళ్లకి కూడా, నా మెంటార్‌కి కూడా. "లోకం మొత్తం చేసేది సరైనదే, నేను చేస్తే తప్పేంటి" అన్నది నా ఆలోచన. నా దృష్టిలో సినిమా చూడడం, లేకపోతే వేరే వ్యాపకాలు కలిగి ఉండడం తప్పేం కాదు. ఎందుకంటే నా ఆత్మీయతను నేను కాపాడుకుంటున్నాను అని ఒక నమ్మకం.

కానీ, గత కొద్దిరోజులుగా నాలో ఉన్న లోటు ఏమిటో నాకు తెలియడం లేదు. ప్రార్థన ఎక్కువసేపు చేయలేకపోతున్నాను. ఈ ఒంటరి తనాన్ని భరించలేక పోతున్నాను. ఎవరితో చెప్పాలనిపించడం లేదు. చూడ్డానికి బాగానే ఉన్నాను కానీ, నేను ఏమిటో అనేది నాకు మాత్రమే తెలుసు. ఆరోజు సంఘంలో సేవకులు వాక్యం చెబుతున్నారు. పాపం పర్యవసానాల గురించి చెబుతూ లాజరు–ధనవంతుని కథ చెప్పిన తర్వాత, మన కొరకు సిలువలో క్రీస్తు చేసిన త్యాగాన్ని వివరిస్తున్నారు. ఇప్పటికి ఎన్నోసార్లు విన్నాను. కొన్ని సినిమాల్లో చూశాను. అయినా కానీ, దాన్ని నేను అన్వయించుకోలేకపోతున్నాను. రక్షణ పొందిన రోజు ఒక భారం దిగినట్లు అయింది. కానీ, ఇప్పుడు ఎన్నిసార్లు సిలువ గురించి మాటలు విన్నా కానీ, ఆ భారం కలగడం లేదు. ఆ మార్పు ఏమిటో, ఆ లోటు ఏమిటో నాకు తెలియడం లేదు. అలా ఉంటుండగా సేవకులు ఒక్కసారి నన్నే ప్రశ్నించినట్టుగా అనిపించింది: "నీ కోసమే సిలువలో ఆయన త్యాగం చేశాడు. ఆయన రక్తానికి నువ్వు ఇచ్చే ప్రతిఫలం ఇదేనా?" ఆ మాటలు విన్న వెంటనే లేచి బయటకు నడుచుకుంటూ వచ్చేసాను.

******

ఒంటరిగా చర్చి పక్కనే ఉన్న పూలతోటలో తిరుగు తున్నాను. వాతావరణం ఆహ్లాదకరంగా ఉన్నప్పటికీ, మనసు ప్రశాంతంగా లేదు. ఏదో తెలియని ఒత్తిడి, భారం, భయం. ఎందుకో తెలియట్లేదు. ప్రార్థన చేయాలన్నా కానీ, ఇష్టం కలగడం లేదు. ఆసక్తి పుట్టడం లేదు. అలా తిరుగుతుండగా ఒక్కసారి పక్కనే ఉన్న చెట్టులో ఒక పువ్వును చూసి నవ్వి, దాన్ని చేత్తో తడిమి ఒక్కసారి

వాసన పీల్చాను. ఒక్కసారిగా మత్తు ఎక్కినట్లు అయింది. ఒక్కసారిగా కళ్ళు తెరిచి చూస్తే ఏదో తెలియని కొత్త ప్రాంతంలో ఉన్నాను. చుట్టూ వాళ్ళ వస్త్రధారణ చాలా వింతగా అనిపిం చింది. నన్ను నేను చూసుకుంటే నా బట్టలు కూడా వారికి తగ్గట్టే ఉన్నాయి. వారి భాష కూడా ఏదో వింత వింతగా తోచింది. కానీ ఆ భాష నాకు అర్థం అవుతుంది. ఈ మనుషులు, వాళ్ళ వేషాలు, ప్రాంతం నాకు తెలిసినట్టే ఉంది.

"ఏంటిది?" అని ఆలోచించుకుంటూ లేస్తుండగా ఎక్కడో గుంపులో హడావిడి జరిగింది. ఇద్దరు వ్యక్తులు ఒక కుంటివాన్ని బాగు చేస్తున్నారు. "అంటే ఇది... ఇది... యేసుక్రీస్తు చనిపోయిన తర్వాత జరిగిన సంఘటన. వాళ్ళు యోహాను, పేతురు. ఇది అపొస్తుల కార్యములు మూడో అధ్యాయంలో మేము చదివిన సంఘటన. అంటే నేను ఇప్పుడు గతానికి వచ్చాను" ఒక్కసారిగా నాకు తల తిరిగినట్లు అయింది. లేచి చూస్తే ఆ ఇద్దరు వ్యక్తులు నన్ను పలకరిస్తున్నారు. వారెవరో కాదు, ఇంతకు ముందు నేను చూసిన యోహాను, పేతురు. నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. వాక్యంలో చదివిన దానికి ఇక్కడ వీళ్ళు చాలా విభిన్నంగా ఉన్నారు. పేతురు గురించి వాక్యంలో కోపిష్టి మనిషి అన్నట్లుగా చెప్పారు కానీ, ఇక్కడ చూస్తే అతని ముఖంలో ఉన్న నెమ్మది, ప్రసన్నతకు నేను అంతవరకు ఎక్కడ ఉన్నాను? ఏమిటి? అనే ఆలోచనలు అన్నీ మర్చిపోయి ఎంతో ప్రశాంతతను పొందాను. వాళ్ళిద్దరూ నన్ను లేపి, "సహోదరుడా, నీవు బాగానే ఉన్నావా?" అన్నారు. నేనేం మాట్లాడలేదు.

"పద, మా ఇంటికి తీసుకెళ్తాం. కాస్త ఆహారం తీసుకొని, మా దగ్గర విశ్రాంతి తీసుకొని మాతో బస చేద్దురమ్మ"ని తీసుకుని వెళ్ళారు. అదొక సాధారణమైన ఇల్లు. వెళ్ళిన వెంటనే వారికి ఎక్కువ బట్టలు కూడా ఉన్నట్లు కనిపించలేదు. పక్కన ఒక మూలకు చాపల వలను పడేసి ఉన్నాయి. ఇంట్లో కొంతవరకు చాపల వాసన వస్తోంది. అది అలవాటు లేకపోవడం కారణంగా కాస్త ఇబ్బందిగా అనిపించింది. వచ్చిన వెంటనే యోహాను, పేతురు ఇద్దరు మోకరిల్లి ప్రార్థన చేసి, నా దగ్గరికి వచ్చి ఆహారం ఇస్తున్నారు. అప్పుడు యోహాను, "సహోదరుడా, నువ్వు ఇక్కడే ఉండు. నేను మరియమ్మను చూసి వస్తాను" అన్నాడు. ఒక్క క్షణం మళ్ళీ జరిగింది గుర్తుకు వచ్చింది. అంటే యేసుక్రీస్తు వెళ్ళిపోయిన తర్వాత యోహాను తన బాధ్యతను నెరవేరుస్తున్నాడు అన్న మాట అని తలచుకోగానే ఆనందంతో మనసు పొంగింది. కాసేపటికి పేతురు నా దగ్గరికి వచ్చి తినడానికి ఆహారం ఇచ్చాడు. అందులో రొట్టె మరియు చేపలు ఉన్నాయి. నేను భోజనం ముగిసిన వెంటనే నా గురించి తెలుసుకోవడానికి ప్రయత్నించాడు. వారి భాష నాకు ఎలా అర్థం అవుతుందో నాకు తెలియడం లేదు. అతనికి ఏం సమాధానం చెప్పాలో అర్థం కావడం లేదు. నాలో కలుగుతున్న భయాన్ని చూసి నేనేం మాట్లాడకపోవడానికి గమనించి, "విశ్రాంతి తీసుకో మిత్రమా, తర్వాత మాట్లాడుకుందాం" అన్నాడు. నేను మళ్ళీ కళ్ళు తెరిచి చూస్తే మాత్రమే తెలిసింది. అప్పుడే ఒక వ్యక్తి వచ్చి "ఆ అబ్బాయి నిద్రలేచాడు" అన్నాడు. వారిద్దరూ హడావిడిగా లోపలి పరిగెత్తుకుని వచ్చారు. పేతురు, యోహాను ఆందోళనగా నన్ను చూసి, "సహోదరా, ఇప్పుడు నీకు ఎలా ఉంది? మా సహోదరుడు లూకా కూడా వచ్చి నిన్ను చూశాడు. నీకున్న అనారోగ్యం ఏమిటో తెలియడం లేదు. ప్రార్థన చేస్తున్నాం" అన్న వెంటనే నాకేం అర్థం కాలేదు. వారి మాటలను బట్టి చూస్తే, నేను గత రెండు రోజులుగా నిద్రించే ఉన్నానని అర్థం అయింది. అసలు నా చుట్టూ ఏం జరుగుతుందో నాకేం తెలియడం లేదు.

******

సమయం గడుస్తుంది. నేను బయటికి వెళ్ళి, చుట్టూ ఉన్నవారి నడవడికను, వారి వస్త్రధారణను చూస్తున్నాను. రోజు వీళ్ళ దినచర్య లేవడం, ప్రార్థించడం, కొంతసేపు చర్చించుకోవడం, బయటికి వెళ్లి రావడం. ఎక్కడికి వెళ్తున్నారు, ఎటు తిరుగుతున్నారు ఏమీ తెలియడం లేదు. ఒక్కొక్క సారి రెండు మూడు రోజులు అటే వెళ్ళేవారు. ఇంటి పక్కనే ఉన్న ఒక వ్యక్తి నన్ను చూసుకునేవారు.


అతని దృష్టిలో నేను మూగవాడిని. అలా నాలుగు రోజులు గడిచాయి. నేను ఇక్కడికి వచ్చి ఎన్ని రోజులు అయిందో నాకు తెలియడం లేదు. ఒక రోజు యోహాను దిగులుగా వచ్చి కూర్చున్నాడు. వారితో ఉన్న చనువు కారణంగా "అయ్యగారు, ఏం జరిగింది?" అని అడిగాను. అతను మౌనంగా తల కిందకు వేశాడు. పేతురు గారిని చూడక అప్పటికి నాలుగు రోజులు అవుతుంది. సరే అని మౌనంగా ఉంటే యోహాను ప్రార్థించడం వినిపిస్తుంది, "ప్రభువా! అతనికి శక్తిని అనుగ్రహించుము" అని. ఆ ప్రార్థన నాకు అర్థం అవ్వలేదు. ఎందుకంటే వాళ్ళు ఎప్పుడైతే పరిశుద్ధాత్మ అభిషేకం పొంది సువార్త పరిచర్యలో ఉన్నారో, శోధన, శ్రమలు వస్తాయన్న విషయం అందరికీ తెలిసిందే. కానీ, యోహాను పేతురు గురించి ఎందుకు ఇలా ప్రార్థించాడు అర్థం అవ్వలేదు. కొంత సమయం తర్వాత పేతురు నీరసంగా రావడం గమనించాను. నన్ను చూసిన వెంటనే లేని ఆనందాన్ని చూపిస్తూ నన్ను పరామర్శించి, నాతో కొంత సమయం మాట్లాడి బయటికి వెళ్లిపోయాడు. నాలో ఎందుకు తెలియని ఒక ఆరాటం కలిగింది. అతనికి ఏం జరిగిందో తెలుసు కోవాలని లేచి అతని వెంబడించడం మొదలు పెట్టాను.

పేతురుగారు హడావిడిగా నడుచుకుంటూ వెళ్తున్నాడు. కొంత సమయానికి ఒక ప్రాంతానికి వెళ్ళాడు. ఆ చుట్టుపక్కల ఎవరో వచ్చి వెళ్ళినట్టుగా గుర్తులు కనిపిస్తుంది. అక్కడ చూసిన వెంటనే ఒక ప్రాంతం దగ్గర ఆయన మోకాళ్లపై కూర్చుని, అక్కడే ఉన్న బండను చేతితోనే తాకి కన్నీళ్లు పెట్టు కుంటున్నాడు. నాకు ఏమీ అర్థం అవ్వడం లేదు. చుట్టూ వాతావరణం పరిశీలించిన తర్వాత ఒక్కసారి జ్ఞాపకం వచ్చినట్లు అయింది. అది గెత్సేమనే తోట. పేతురు కూర్చున్నది యేసు ప్రభువు చెమట రక్తంగా మారిన ప్రాంతం. నెమ్మదిగా ఆయన లేచి నడవడం మొదలు పెట్టాడు. అతని గమ్యం ఎటువైపు నాకు తెలియడం లేదు. కొన్ని క్షణాలు నడిచిన తర్వాత, ఆయన అక్కడే తలకిందికి వేసి మోకాళ్ళపై కూర్చున్నాడు. చుట్టూ చీకటిగా ఉన్నట్లుగా అనిపించింది నాకు. ఒక్కసారిగా పేతురు లేచి పరిగెత్తడం మొదలు పెట్టాడు. ఆయనకు ఏం కనబడిందో నాకు తెలియదు. నేను ఆయన వెంటనే పరిగెత్తుతున్నాను. పేతురు ఏడుపు నాకు వినిపిస్తుంది. "వద్దు, వద్దు" అని అరుస్తూ, "ప్రభువా! ప్రభువా!" అన్నారు. కొంత దూరం వెళ్ళిన తర్వాత, చుట్టూ రాళ్ళ గుట్టలు కనిపించాయి. పేతురు పరిగెడుతున్నప్పుడు అతని కాళ్ళకి ఉన్న చెప్పులు తెగిపోయాయి. రాళ్ళ నుండి పరిగెత్తడం వల్ల ముళ్ళు గుచ్చుకపోవడం, పాదమంతా రక్తంతో తడిసినట్లుగా అయినా అతని పరుగు ఆపడం లేదు. నేను పేతురు వెనుకనే పరిగెత్తుతున్నాను. చూస్తూ ఉండి, పరిగెత్తు కుంటూ ఒక కొండపైకి వెళ్ళాడు. ఆ కొండ పైన ఏదో జరిగిన ఆనవాళ్ళు కనిపించాయి నాకు. అది గొల్గొతా ప్రాంతమని అర్థమైంది. ఒక్కసారి నా దేహం చల్లబడిపోయింది. నేను అక్కడి నుండి కదలలేక పోతున్నాను. ఒక మూడు గోతులు అక్కడ కనిపించాయి. అవి సిలువను పాతిన గుర్తులని నాకు అర్థమైంది. వాటికి కొంత దూరంలో పేతురు ఏడుస్తూ పడి పోయాడు. అక్కడే పడి దొర్లి దొర్లి ఏడుస్తున్నాడు. అతని రోదనతో ఆ ప్రాంతం మొత్తం దద్దరిల్లుతుంది. ఒక్కసారిగా లేచి కన్నీరు కారుస్తూ ఉండిపోయాడు. సమయం గడిచింది. కొంతసేపటికి ఆయన లేచి నెమ్మదిగా నడవడం మొదలుపెట్టాడు. ఆయన ముఖంలో ఒక నెమ్మది, ప్రశాంతత కనిపించాయి. కొంత దూరం ఆయన్ని వెంబడించిన తర్వాత ఆయన దగ్గరికి వెళ్లి పిలిచాను. నన్ను చూస్తూ ప్రేమగా చూశాడు. ఇదే ఆనందకరమైన ముఖాన్ని నేను కొన్ని రోజుల ముందు చూసాను. అది ఆ దేవాలయంలో ఆ వ్యక్తిని స్వస్థపరుస్తున్నప్పుడు. అతను ఏదేదో మాట్లాడుతున్నాడు. ఏవీ నాకు చెవికెక్కడం లేదు. మౌనంగా ఆయనతోపాటు వెళ్ళాను. ఇంటికి వెళ్ళిన వెంటనే, నేను, పేతురు, యోహాను, ఇంటి పక్కన ఉండే వ్యక్తి అందరం కలిసి భోజనం చేశాం. పేతురు, యోహాను నా తలపై చేతుల నుంచి ప్రార్థించారు.

(మిగిలినది వచ్చే సంచికలో)

**– డి. అజయ్,** నిర్మల్

# ఆగస్టు '25 యెహెజ్కేలు గ్రంథము (11 - 12 అధ్యాయాలు)




**అడ్డం**

2. వారు ఎక్కడికి పోయి దేశాంతర నివాసుల గుదురు?
5. వారు వెళ్లిన ఆ యా దేశములలో కొంత కాలము నేను వారికి ఎలాగు ఉందును?
6. నేను మీకు శిక్ష విధింపగా నేను ఎవరినని మీరు తెలిసికొందురు?
8. చింతతో వారు ఏమి తిందురు?
9. దర్శనములో నైనట్టు ఏ దేశమునందు చెరలో ఉన్నవారి యొద్దకు నన్ను దింపెను?
10. నేను మీ మీదికి ఏమి రప్పించెదను?

**నిలువు**

1. మీరు యెహోవాకు ఎలాగు నుండుడి?
3. ఏ సమయమున యెహోవా వాక్కు నాకు ప్రత్యక్షమై యీలాగు సెలవిచ్చెను?
4. పట్టణములో ఏమి యోచించి దురాలోచన చేయువారు?
7. నేనే యెహోవానై యున్నానని మీరు తెలిసికొనునట్లు కాపురపు పట్టణములు ఎలాగు ఉందును?
8. నేనిచ్చు మాట యికను ఏమి లేక జరుగును?
9. దండు వారినందరిని నేను నలుదిక్కుల చెదరగొట్టి ఏమి దూసి వారిని తరిమెదను?

– కె.కిరణ్ కుమార్, స్టాఫ్, మహబూబ్‌నగర్

**జూలై '25 యెహెజ్కేలు గ్రంథము (9 - 10 అధ్యాయాలు)**

**అడ్డం:** 3. ఏక 5. నీలకాంతమయమైన 8. హతమైన వారితో 9. చక్రములకు 10. పట్టణము మీద 11. లోపలి 13. లేఖకుని సిరా

**నిలువు:** 1. హతము 2. మానవ హస్తము 4. కన్నులతో 6. లలాటముల 7. యెహోవా తేజో 9. చక్రములలో 12. పక్షిరాజు 14. కుడి

**విజేతలు:** 1. జ్యోతి గంగారాం, కొంపల్లి, 2. మేసు స్వప్న తుకారం, రాజన్న సిరిసిల్ల, 3.తమటం నాగరాజు, ఇచ్చోడు, ఆదిలాబాద్

# ఎందుకు చెప్పలేదు మిత్రమా?

రక్షణ పొందిన తన ప్రాణ స్నేహితుడు క్రీస్తు గురించి తనకు చెప్పకపోవడంతో, రక్షణ లేని ఆ స్నేహితుడు మరణించి నరకంలో కాలుతూ, ఆ భరించరాని వేదనతో, అంతులేని శోకంతో, తన మిత్రుడిని అడుగుతున్న ప్రశ్నలివి ...

ఎందుకు చెప్పలేదు మిత్రమా..?
అంధకారం నుండి విడిపించే ఆ సత్యాన్ని...
రక్షణలోనికి నడిపించే ఆ మార్గాన్ని...

చెబితే వ్యతిరేకిస్తానన్న భయమా?
లేక తిరస్కరిస్తే అవమానమా?

రక్షణ నీకు మాత్రమే చెందాలన్న స్వార్థమా?
లేక నీ విశ్వాసం పైన నీకే సందేహమా?

నా దరికి చేరలేక దూరాన్ని పాటించే అంటరాని తనమా?
లేక నా అంధకారాన్ని చూడలేని గుడ్డితనమా?

సువార్త ప్రకటించడం ఏమైనా అధిరోహించ లేని పర్వతమా?
లేక ముగించలేని సుదూర ప్రయాణమా?

ఆ క్రీస్తు ప్రేమ నా హృదయంలో ఏమైనా నిషేధమా?
లేక ఈ నరకం నాకు ముందే నిర్దేశించబడ్డ గమ్యమా?



నా సంకెళ్లు చూసి కూడా తెంచలేదు,
నీ హృదయం ఇంత కఠినమా?
ఒక స్నేహితుడిగా ఇది నీకు న్యాయమా?

ఇన్నాళ్ల మన స్నేహం కేవలం ఒక వేషమా?
క్రీస్తుని చూపించలేని జీవితం అసలు క్రైస్తవ్యమా?

– మార్టిన్ లూథర్ ఫిరంగి,
రాజేంద్రనగర్ జోన్, సైబరాబాద్

Let Jesus Christ be the gift to your friend on this Friendship Day !!

UESI PUBLICATION TRUST - TELANGANA BRANCH

Edited, Printed and Published by Mr. Dasari Rajesh for UESI Publication Trust, Telangana Branch
H. No: 6 - 68/36, Jangampet Village, Jinnaram Mandal, Sangareddy District, Pin-502319
Printed at SRI RR Offset printers, Azamabad, Hyderabad.
(For Private Circulation Only)